TELTEL/2016/69862
# జనం పవర్
తెలుగు దినపత్రిక
JANAM POWER
కరీంనగర్ బుధవారం 27.08.2025 సంపుటి : 10 సంచిక : 91 పేజీలు : 12 వెల 05/-
Karimnagar Wednesday 27.08.2025 Volume : 10 Issue : 91 Pages : 12 Cost 05/-




# 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- 29న సీఎం ఆధ్వర్యంలో క్యాబినేట్ సమావేశం
- మొదటి రోజు మాగంటి గోపీనాథ్ కు సంతాప తీర్మానం
- ముఖ్యంగా కాళేశ్వరం నివేదిక పై వాడీవేడిగా చర్చ
- మార్వాడీ గోబ్యాక్ అంటూ కొత్త నినాదం కూడా..
- బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లు వల్లే గెలిచారని ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ




**జనం పవర్, హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్రంలో మాన్సూన్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 29వ తేదీన మంత్రివర్గ సమావేశం జరిగిన తర్వాత, మరుసటి రోజు నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల

..మిగతా 2లో



## స్థానిక సంస్థల ఎన్నికల వేళ

- నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్

5



## మాతో పోటీపడితే చైనాకు వినాశనమే

# తెలంగాణకు పాకిన దొంగ ఓట్ల ఆరోపణలు

బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారంటూ కాంగ్రెస్ ఆరోపణలు
అసెంబ్లీలో 8 సీట్లే.. పార్లమెంట్‌లోనూ 8సీట్లే ఎలా సాధ్యం ?
ఓటరు జాబితాలో వ్యత్యాసాలు ఉన్నాయంటున్న కాంగ్రెస్
మహారాష్ట్ర వాసులకు తెలంగాణలో ఓటింగ్
బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ పై విమర్శలు




**జనం పవర్, హైదరాబాద్ :**
తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ దొంగ ఓట్ల వివాదం చెలరేగింది. తాజాగా పీసీసీ చీఫ్ చేసిన ఆరోపణలతో ఈ చర్చ మళ్లీ కళ్లకు కట్టినట్టు ముందుకు వచ్చింది. ముఖ్యంగా బీజేపీ అధినేత బండి సంజయ్ నియోజకవర్గంలోనే పెద్దఎత్తున దొంగ ఓట్లు నమోదు అయ్యాయని కాంగ్రెస్ విపక్షంగా ప్రశ్నబడ్డి ప్రస్తావించింది. కాంగ్రెస్ వాదన ప్రకారం, బీజేపీకి రాష్ట్ర అసెంబ్లీలో కేవలం 8 సీట్లు మాత్రమే వచ్చాయి. అదే సమయంలో పార్లమెంటు ఎన్నికల్లో కూడా 8 సీట్లు రావడం "అసాధారణం" అని పేర్కొంటోంది. ప్రజల అసలు తీర్పు ఇలా ఉండదని, ఇది కచ్చితంగా అనుమానాస్పదమని ఆ పార్టీ సమర్థిస్తోంది. ఓటర్ జాబితాలో వ్యత్యాసాలు, ఎంపిక చేసిన

..మిగతా 2లో



# నేటి నుంచి ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

3

- విజయదశమి పర్వదినంతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్ల ప్రస్థానం
- ఆగస్టు 26 నుంచి 28 వరకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మూడు రోజులపాటు కార్యక్రమాలు
- సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ ఉపన్యాసాల పరంపర
- సుమారు 2000 మందికి పైగా ప్రముఖులకు ఆహ్వానాలు
- ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు వంటి మైనారిటీ వర్గాలకూ..

# మహేశ్ కుమార్ గౌడ్‌కి రఘునందన్ రావు సవాల్

- రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్దామా
- ఓటు చోరీపై పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై కామెంట్స్
- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ లోపంతోనే యూరియా కొరత
- ఎక్కడ లేని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు

2






# ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్నలు

- నిషేధిత భూముల జాబితాను సబ్‌రిజిస్ట్రార్‌లకు 9 వారాల్లో ఇవ్వండి
- అందుకు విఫలమైతే సీఎస్ హాజరై వివరణ ఇవ్వాలి
- నిషేధిత భూములపై పాస్‌బుక్‌లు ఎలా జారీ అయ్యాయి
- పదేళ్ల క్రితం ఫుల్‌బెంచ్ తీర్పు ఇచ్చినా ఎందుకు అమలు చేయలేదు : హైకోర్టు
- వివాదాల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశాం: ప్రభుత్వం



**జనం పవర్, హైదరాబాద్ :**
నిషేధిత భూముల జాబితాను సబ్‌రిజిస్ట్రార్‌లకు ఎందుకు అందజేయరని, రిజిస్ట్రేషన్‌కు వెళ్లేదాకా ప్రజలకు తెలియకుండా వారిని ఎందుకు చీకట్లో ఉంచుతున్నారని ప్రభుత్వాన్ని హైకోర్టు సోమవారం ప్రశ్నించింది. 9 వారాల్లోగా నిషేధిత భూముల జాబితాను సబ్‌రిజిస్ట్రార్‌లకు

..మిగతా 3లో

3

## నేడే అమల్లోకి అమెరికా అదనపు సుంకాలు

- అధికారికంగా ఉత్తర్వులు జారీ

## సాంప్రదాయ దుస్తులుంటేనే అనుమతులు

- ఇంద్రకీలాద్రిలో కొత్త నిబంధనలు

3

# ప్రియుడి చేతిలో వివాహిత దారుణ హత్య




**జనం పవర్, హైదరాబాద్ :**

మైసూరు జిల్లా సలిగ్రామ్ మండలంలో ప్రేమ ముసుగులో హృదయాన్ని కలిచివేసే ఘటన చోటుచేసుకుంది. దర్శిత (22) అనే యువతి తన ప్రియుడు సిద్ధరాజు చేతిలోనే దారుణంగా ప్రాణాలు కోల్పోయింది. కొంత కాలంగా సిద్ధరాజుతో ప్రేమలో ఉన్న దర్శిత పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. అయితే సాకులు చెబుతూ తప్పించుకున్న సిద్ధరాజు, కుటుంబ పెద్దల ఒత్తిడితో దర్శితను కేరళకు చెందిన సుభాష్‌తో వివాహం జరిపించారు. వీరికి ఒక పాప కూడా పుట్టింది. భర్త దుబాయ్‌లో ఉద్యోగం చేస్తుండటంతో, దర్శిత మళ్లీ సిద్ధరాజుతో సంబంధం కొనసాగించింది. తన కూతురితో కలిసి వస్తానని, భర్తతో ఉండలేకపోతున్నానని పట్టుబట్టడంతో, ఎలాగైనా వదిలించుకోవాలనుకున్న సిద్ధరాజు దారుణ యత్నానికి పాల్పడ్డాడు. ఒక హోటల్‌కు తీసుకెళ్లి దర్శితను తీవ్రంగా కొట్టి, చివరికి నోటిలో డిటోనేటర్ పెట్టి పేల్చేశాడు. దీంతో ఆమె ముఖం ఛిద్రమై గుర్తుపట్టలేని స్థితిలో మృతి చెందింది. రెండు రోజులుగా కనిపించడం లేదని దర్శిత అత్తింటివారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, హోటల్ సిబ్బంది గుర్తు తెలియని మృతదేహం ఉందని సమాచారమిచ్చారు. విచారణలో తొలుత సెల్‌ఫోన్ పేలుడుతో మృతి చెందిందని అబద్ధం చెప్పిన సిద్ధరాజు, చివరకు పోలీసుల దర్యాప్తులో నేరం ఒప్పుకున్నాడు. ప్రస్తుతం సిద్ధరాజును పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

# దొంగ ఓట్లు అంటూ కాంగ్రెస్ డ్రామాలు



- **ఇది ప్రజలను అవమానించడమే**
- **కేంద్రమంత్రి బండి సంజయ్**

**జనం పవర్, హైదరాబాద్ :**

ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 30 ఏళ్లుగా తాను ప్రజాప్రతినిధిగా ఉన్నానని చెప్పారు. వార్డు మెంబర్ కానివాళ్లు కూడా విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

''దొంగ ఓట్లు అంటూ కాంగ్రెస్ నేతలు చేసే దుష్ప్రచారం ప్రజలను అవమానించడమే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు ఒక్క పైసా అయినా ఇచ్చిందా? కేంద్రం నిధులు ఇస్తుందనే ఇప్పుడు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు రాత్రిపూట యాత్రలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. కరీంనగర్‌లో ప్రతి ఓటూ పరిశీలించి దొంగ ఓట్ల తీసేయాలి. రెండు చోట్ల ఓటు వేయడం ఎవరికైనా సాధ్యమా?అవగాహన లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఓట్ల చోరీ గురించి కాకుండా సీట్ల చోరీ గురించి మాట్లాడాలి. రొహింగ్యాల విషయంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు. దేశం ముఖ్యమా? ఓటు బ్యాంకు ముఖ్యమా?అప్పుడు భారత రాష్ట్ర సమితి.. ఇప్పుడు కాంగ్రెస్.. రెండూ అదే తరహా రాజకీయాలు చేస్తున్నాయి'' అని బండి సంజయ్ విమర్శించారు.

# మహేశ్ కుమార్ గౌడ్‌కి రఘునందన్ రావు సవాల్

- **రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్దామా:**
- **ఓటు చోరీపై పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై కామెంట్స్**
- **రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ లోపంతోనే యూరియా కొరత**
- **ఎక్కడ లేని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు**

**జనం పవర్, హైదరాబాద్ :**



తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ బాధ్యత మరిచి మాట్లాడుతున్నారని భాజపా ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. మా పార్టీ ఎంపీలందరం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్తాం.. దానికి మీరు కూడా సిద్ధమా అని సవాల్ విసిరారు. రాజీనామా చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ఓటు చోరీపై పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై రఘునందన్‌రావు ఘాటుగా స్పందించారు. పీసీసీ అధ్యక్షుడిగా ఏది పడితే అది మాట్లాడితే కుదరదు. ఓటు చోరీ చేస్తే దేశంలో ఉన్న అన్ని పార్లమెంట్ స్థానాల్లో మేమే గెలుస్తాం కదా. మీరెందుకు 8 ఎంపీ స్థానాలు గెలుస్తారు?అసదుద్దీన్ ఎలా గెలుస్తారు. దమ్ముంటే మీ 8 మంది ఎంపీలతో రాజీనామా చేయించండి. మేమూ రాజీనామా చేస్తాం. కొత్త ఓటర్ లిస్ట్‌తో మళ్లీ ఎన్నికలకు వెళ్తాం. అప్పుడు వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలుస్తాయి. భాజపాను అడిగి కామారెడ్డి డిక్లరేషన్ హామీ ఇచ్చారా? కుంటి సాకులు చెప్పకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. కాళేశ్వరంపై నిజాయితీగా కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ లోపంతోనే యూరియా కొరత ఏర్పడింది. ఇతర రాష్ట్రాల్లో లేని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వచ్చింది?. అని రఘునందన్‌రావు ప్రశ్నించారు.

# 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

మరణించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు మొదటి రోజు సభలో సంతాప తీర్మానం ప్రకటించనున్నారు. ఈ సమావేశాల్లో ఉప సభాపతి ఎన్నిక, కాళేశ్వరం ప్రాజెక్టు గురించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ జరగనుంది. అంతేకాకుండా, పెండింగ్‌లో ఉన్న కొన్ని బిల్లులు కూడా సభ ముందుకు రానున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రతిపక్ష నేత కేసీఆర్ (కె. చంద్రశేఖర్ రావు) అసెంబ్లీకి హాజరవుతారా? ప్రభుత్వం ఏ అంశాలపై దృష్టి సారిస్తుంది? అన్న కోణాల్లో విశ్లేషణ చేస్తే...




**సమావేశాల నేపథ్యం**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ సమావేశాలను కీలకమైనవిగా భావిస్తోంది. మాన్సూన్ సీజన్‌లో వరదలు, వ్యవసాయ సమస్యలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలు చర్చకు రానున్నాయి. ముఖ్యంగా, పెండింగ్ బిల్లుల్లో రైతు భరోసా సవరణ బిల్లు, బీసీ రిజర్వేషన్లు సంబంధిత బిల్లులు, హైదరాబాద్ మెట్రో విస్తరణకు సంబంధించిన నిధులు వంటివి ఉండవచ్చు. ఇటీవలి వరదల కారణంగా రాష్ట్రంలో ఏర్పడిన నష్టాలు, పునరావాస చర్యలు కూడా సభలో ప్రస్తావనకు రానున్నాయి.

కానీ, ఈ సమావేశాల్లోనే కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు గురించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ జరగాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నివేదికలో ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు, డిజైన్ లోపాలు, ఆర్థిక నష్టాలు వంటి అంశాలు ప్రస్తావించబడ్డాయి. తెలంగాణ హైకోర్టు ఈ నివేదికను అసెంబ్లీలో పట్టికపై పెట్టడానికి స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ప్రభుత్వం, ఈ నివేదికతో పాటు ఆక్షన్ టేకెన్ రిపోర్టును కూడా సభలో చర్చకు పెట్టాలని హైకోర్టుకు చెప్పింది. ఇది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి సంబంధించిన అంశం కావడంతో, ఇది సభలో తీవ్ర వాదోపవాదాలకు దారి తీసే అవకాశం ఉంది. ప్రభుత్వం దీనిని రాజకీయంగా వినియోగించుకోవాలని చూస్తుంది, అయితే బీఆర్ఎస్ దీనిని కుట్రగా చిత్రీకరిస్తుంది. ఇతర అంశాల్లో, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, రైతు రుణమాఫీ, ఉద్యోగాల నియామకాలు వంటివి కూడా చర్చకు రానున్నాయి. ప్రభుత్వం, ఈ సమావేశాల ద్వారా తన ఆరు గ్యారంటీల అమలు పురోగతిని ప్రకటించాలని భావిస్తోంది.

**కేసీఆర్ హాజరవుతారా?**

ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కావాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసురుతున్నారు. చాలా రోజులుగా కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు. మార్చి 2025లో బడ్జెట్ సమావేశాలకు ఆరు నెలల తర్వాత హాజరైన కేసీఆర్, అప్పటి నుంచి మళ్లీ సభలకు రాలేదు. జులై 2025లో రేవంత్ రెడ్డి, కేసీఆర్‌ను అసెంబ్లీకి రమ్మని పదేపదే సవాల్ చేశారు. ఆరోగ్య సమస్యలు, పార్టీ వ్యూహాత్మక నిర్ణయాలు వంటివి కారణాలుగా చెబుతున్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌లోనే ఉండటాన్ని రేవంత్ రెడ్డి తీవ్రంగా విమర్శిస్తున్నారు. కాళేశ్వరం నివేదికపై చర్చలో భాగంగా కేసీఆర్ హాజరవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది బీఆర్ఎస్‌ను రక్షణాత్మకంగా మార్చుతుంది. కేసీఆర్ రాకపోతే, ప్రతిపక్షం బలహీనతగా చిత్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. కేసీఆర్ హాజరు కాని సందర్భంలో కూడా, కేటీఆర్, హరీశ్ రావు వంటి నేతలు సభలో ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ వ్యూహం. కాళేశ్వరం నివేదికను 'రాజకీయ కుట్ర'గా చిత్రీకరిస్తున్నారు. కేసీఆర్ పిటిషన్‌లు హైకోర్టులో తిరస్కరణకు గురైనా, పార్టీ దీనిని సవాల్‌గా తీసుకుని చర్చలో పాల్గొనాలని భావిస్తోంది. కానీ, కేసీఆర్ రాకపోతే పార్టీ ఐక్యతపై ప్రశ్నలు లేవనెత్తవచ్చు.

ప్రజలు, కాళేశ్వరం వంటి మెగా ప్రాజెక్టుల్లో అవకతవకలపై స్పష్టత కోరుకుంటున్నారు. కేసీఆర్ హాజరు కాకపోతే, అది ధ్యతారాహిత్యంగా కనిపించవచ్చు. మరోవైపు, సమావేశాలు ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తే మాత్రమే ఉపయోగకరమవుతాయి. మొత్తంగా, ఈ సమావేశాలు రాజకీయ వేడిని పెంచనున్నాయి. కేసీఆర్ హాజరవుతారా లేదా అనేది సస్పెన్స్‌గా మారింది, కానీ చర్చలు తప్పకుండా తీవ్రంగా సాగనున్నాయి.



# గాంధీ కుటుంబమే నాకు దైవం

- **ఆర్ఎస్ఎస్ గీతం వివాదంపై డీకే శివకుమార్**

**జనం పవర్, హైదరాబాద్ :**

కర్ణాటకలో ఒకవైపు 'సీఎం మార్పు' అంశంపై ఊహాగానాలు వినిపిస్తుండగా.. మరోపక్క ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్ఎస్ఎస్ ప్రార్థనా గీతాన్ని ఆలపించటం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే . దాంతో కాంగ్రెస్ నేతలంతా ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ వ్యవహారంపై తాజాగా డీకే స్పందించారు. భాజపా ను విమర్శించేందుకే నేను ఆ పాట పాడాను. కానీ కొందరు దీని ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని అనుకుంటున్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారు. నేను ఎవరి మనోభావాలు దెబ్బతీయాలని అనుకోవడం లేదు. ఈ వ్యవహారంతో ఎవరైనా బాధపడిఉంటే.. అందుకు చింతిస్తున్నాను. నేను క్షమాపణలు చెప్తాను. అయితే అవి రాజకీయ ఒత్తిడివల్ల చెప్పే క్షమాపణలు కాదు అని డీకే వెల్లడించారు. అలాగే గాంధీ కుటుంబం , కాంగ్రెస్ పార్టీపై తనకున్న నిబద్ధత తిరుగులేనిదని వ్యాఖ్యానించారు. నేను కాంగ్రెస్ వ్యక్తిగానే జన్మించా.. అలాగే మరణిస్తా. గాంధీ కుటుంబం నాకు దైవంతో సమానం. నేను వారి భక్తుడిని అని స్పష్టం చేశారు. ఇటీవల చిన్నస్వామి క్రీడా మైదానంలో తొక్కిసలాట అంశంపై బదులిస్తున్న సందర్భంగా డీకే శివకుమార్ ఆర్ఎస్ఎస్ ప్రార్థనా గీతాన్ని ఆలపించటం సభను కాసేపు ఆలోచనలో పడేసింది. తనపై విపక్ష సభ్యులు చేస్తున్న ఆరోపణలు సహేతుకంగా లేవని, భాజపా పాలిత రాష్ట్రాల్లో సంభవించిన తొక్కిసలాట ఘటన వివరాలు తన వద్ద ఉన్నాయన్నారు. ఈ సందర్భంగానే 'నమస్తే సదా వస్తలే మాతృభూమే' అంటూ ఆ సంస్థ ప్రార్థన గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా భాజపా సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతిచ్చారు. సభ రికార్డుల నుంచి ఈ గీతాన్ని తొలగించరాదంటూ వారు నినదించారు.
డీకే శివకుమార్ ఇలా వ్యవహరించడం ఇదే తొలిసారి కాదు . గతంలో అమిత్ షాతో కలిసి సమావేశంలో పాల్గొనడం, కుంభమేళాలో పుణ్య స్నానం, ఇటీవల ప్రధాని మోదీతో దిల్లీలో భేటీ, యడియూరప్పతో తరచూ మంతనాలు, తాజాగా ఆర్ఎస్ఎస్ గీతం పాడటం అధిష్ఠానానికి ప్రత్యేకంగా సంకేతాలు పంపడం కిందికే వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాయకత్వ మార్పు అంశం తెరపైకి వచ్చినప్పుడు, తనపై పార్టీలో వ్యతిరేకత పెరిగినప్పుడు భాజపాతో సఖ్యతగా ఉన్నట్లు సందేశాలు పంపుతుంటారు. తనకు భాజపా నుంచి మంచి అవకాశాలున్నాయన్నట్లు తమ పార్టీకి తెలియజేయటమే లక్ష్యమని పలువురు నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

# తెలంగాణకు పాకిన దొంగ ఓట్ల ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాల్లో అనూహ్యమైన ఫలితాలు ఈ అనుమానాలకు బలం చేకూర్చుతున్నాయి.




బండి సంజయ్ సీటు చుట్టూ వివాదం
భారతీయ జనతా పార్టీ తొలి వరుస నాయకుల్లో ఒకరైన బండి సంజయ్ నియోజకవర్గంలోనే అనుమానాస్పద ఓట్ల నమోదు జరిగిందనడం రాజకీయంగా మరింత ప్రాధాన్యం పొందుతోంది. బండి సంజయ్ పార్టీకి వ్యూహాత్మకంగా కీలక నేత. ఆయన నియోజకవర్గంలో ఈ రకమైన ఆరోపణలు బీజేపీ ప్రతిష్టను సైతం ప్రశ్నించే స్థాయికి తీసుకెళ్తున్నాయి. దొంగ ఓట్లు అంటే చెల్లని వ్యక్తులు ఓటర్ జాబితాలో పేర్లు చేరడం, మరణించిన వారి పేర్లు కొనసాగడం, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉండడం, లేదా వలస కార్మికుల పేర్లు "రాజకీయ ఉద్దేశ్యాల"కోసం వినియోగించడమనే రూపాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. గతంలోనే ఈ అంశంపై ఎన్నోసారి వివాదాలు నెలకొన్నాయి. ఆ సమయంలో కూడా కాంగ్రెస్, బీజేపీ ఒకరినొకరు ఆరోపించుకున్న సన్నివేశాలు వెలుగులోకి వచ్చాయి.

**ఎన్నికల కమిషన్ పాత్రపై ప్రశ్నలు**

ఎన్నికల కమిషన్ పాత్రపై విపక్షాల నుండి విమర్శలు వస్తున్నాయి. ఓటర్ల జాబితా సవరణలు జరుగుతున్నప్పుడు కచ్చితంగా నిర్దిష్టమైన పద్ధతులు పాటిస్తున్నారా? స్థానిక అధికారుల నుండి ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా జాబితా సిద్ధమవుతున్నదా? అనే అంశాలపై ఆందోళనలు వ్యక్తమౌతున్నాయి. ప్రజాస్వామ్యంలో విశ్వసనీయతా ప్రాణం *ఓటు – అదే ప్రశ్నార్థకమైతే* మొత్తం వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతాయి. బీజేపీ వర్గాలు ఈ ఆరోపణలను ఖండిస్తూ కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడమే ఈ ప్రచారం అని వాదిస్తున్నాయి. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌పై విశ్వాసం కోల్పోయినందువల్లే బీజేపీకి ఓట్ల వర్షం కురిసిందని, దీనిని "దొంగ ఓట్లు"గా ముద్ర వేయడం దురుద్దేశపూర్వక ప్రచారమేనని ఆ పార్టీ నేతలు నిలదీస్తున్నారు. బీజేపీ నేతలు ఈ ఫలితాలు ప్రజల నిజమైన ఆకాంక్షల ప్రతిబింబమేనని స్పష్టం చేస్తున్నారు.

**రాజకీయ లాభనష్టాలు**

ఈ ఆరోపణలు తక్షణ ఫలితాలు ఇవ్వకపోయినా, దీర్ఘకాలంలో తప్పక ప్రభావం చూపుతాయి. ఒకవైపు కాంగ్రెస్ తన శక్తి పునర్నిర్మాణంలో భాగంగా ప్రజలలో విశ్వాసం రేకెత్తించాలని చూస్తోంది. మరోవైపు బీజేపీ తన పెరుగుతున్న బలోపేతాన్ని కొనసాగించడం కోసం ఈ ఆరోపణల నుండి బయటపడాలని ప్రయత్నిస్తోంది. వ్యవస్థపైనా, ప్రజాప్రతినిధులపైనా ఈ ఆరోపణలు నీడలా వెంటాడితే ఎన్నికల విశ్వసనీయతపై మరింత లోతైన చర్చ తలెత్తుతుంది. సాధారణ ఓటరు కోణంలో చూస్తే – ప్రతి ఎన్నిక తర్వాత ఓట్ల లెక్కలు అనుమానాస్పదంగా మారడం, ఓటర్ జాబితా లోపాలపై పునరావృతమయ్యే ఆరోపణలు ప్రజాస్వామ్య పటిష్ఠతను దెబ్బతీస్తాయి. ఓటు అనే హక్కు విలువ తగ్గిపోతుందనే అనుభవం ప్రజల్లో పెరగవచ్చు. దీని వల్ల ప్రజాస్వామ్యంపై నమ్మకం కదులుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ముందుజాగ్రత్తలు అవసరం**

నిపుణుల సూచన ప్రకారం, ఓటర్ జాబితా పూర్తి పారదర్శకతతో తయారుకావాలి. బూత్ స్థాయిలో నిర్ధారణ బలపరచడం, బయోమెట్రిక్ లేదా టెక్నాలజీ ఆధారంగా పత్రాల ధృవీకరణ జరగడం ద్వారా దొంగ ఓట్ల సమస్యకు పరిష్కారం దొరకవచ్చు. అదనంగా, ప్రతి పెద్ద ఎన్నికకు ముందు ఒక ప్రత్యేక ఆడిట్ నిర్వహించడం కూడా అవసరమని సూచనలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ చేసిన దొంగ ఓట్ల ఆరోపణలు, బీజేపీ ఖండనలు, ఎన్నికల కమిషన్ పాత్రపై ప్రశ్నలు, ఇవన్నీ కలిపి ప్రస్తుతం తెలంగాణ రాజకీయ వాతావరణంలో ఉత్కంఠ సృష్టిస్తున్నాయి. అసలైనది ఏదో, తుది సత్యం ఏదో వెల్లడి కావాల్సిందే. కానీ ఒక అంగీకారం మాత్రం మూడు వర్గాల మధ్యనూ స్పష్టంగా కనిపిస్తోంది.

# త్వరలో భాజపా కొత్త అధ్యక్షుడి ఎన్నిక

**జనం పవర్, హైదరాబాద్ :**

భాజపా నూతన సారథి ఎన్నికకు ఆ పార్టీ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే పలు కారణాలతో ఎన్నిక ఆలస్యం కావడంతో.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీ ప్రకటన కు ముందే ఈ నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ విషయంలో ఇప్పటికే పార్టీ అగ్రనాయకుల మధ్య సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక తర్వాత నూతన సారథి ఎంపికపై భాజపా వేగం పెంచనుందని.. ఈ ఎంపికకు సంబంధించి ఇప్పటికే కొంతమంది వ్యక్తుల పేర్లను పార్టీ అధినేతలు పరిశీలించినట్లు వివరించారు. ఇక, ఈ జాతీయ అధ్యక్ష పదవిని మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అందులో ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఏపీ భాజపా ఎంపీ పురందేశ్వరీతో సహా పలువురి పేర్లు వినిపించాయి. భాజపా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి సామాజిక సమీకరణాలను కాకుండా పార్టీని బలోపేతం చేయగలిగే నాయకుడిని ఎన్నుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. భాజపా సంస్థాగత ఎన్నికలు ప్రతి మూడేళ్లకోసారి జరుగుతుంటాయి. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 2019 నుంచి ఆ పదవిలో కొనసాగుతున్నారు. ఆయన రెండో టర్మ్ 2024 జూన్‌తో ముగిసినప్పటికీ.. ప్రస్తుతం ఆయన కేంద్రమంత్రిగా, పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతల్లో కొనసాగుతున్నారు. భాజపా నూతన అధ్యక్షుడి ఎన్నిక చేపట్టాలంటే.. 50శాతం రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత ఎన్నికలు పూర్తికావడం తప్పనిసరి. దీనికిముందు బూత్, మండల, జిల్లా స్థాయిలకు ఎన్నికలు నిర్వహించాలి. అయితే, ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ హరియాణా, ఝార్ఖండ్, మహారాష్ట్ర, దిల్లీ వంటి కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత పార్లమెంటు సమావేశాలు ఉండటంతో జాప్యం చోటుచేసుకుంది.

# నేడే అమల్లోకి అమెరికా అదనపు సుంకాలు




- **అధికారికంగా ఉత్తర్వులు జారీ**

**జనం పవర్, హైదరాబాద్ :**

రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు సుంకాలు మరి కొన్ని గంటల్లో అమల్లోకి రానున్నాయి. దీనిపై అమెరికా తాజాగా న్యూదిల్లీకి అధికారికంగా నోటీసులు పంపించింది. అగ్రరాజ్య కాలమానం ప్రకారం ఆగస్టు 27వ తేదీ ప్రారంభమయ్యే అర్ధరాత్రి 12.01 గంటల నుంచి (అంటే భారత కాలమానం ప్రకారం ఆగస్టు 27 ఉదయం 10 గంటల ప్రాంతంలో) ఈ అదనపు సుంకాలు అమల్లోకి వస్తాయని స్పష్టంచేసింది. ఆ సమయం తర్వాత నుంచి అమెరికాలోకి ప్రవేశించే భారత ఉత్పత్తులకు ఈ టారిఫ్‌లు వర్తిస్తాయని వెల్లడించింది. ఈమేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ తమ నోటీసుల్లో పేర్కొంది. భారత్‌లో గతంలో అమెరికా 25 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. అవి ఆగస్టు 7 నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే, రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో మరో 25శాతం అదనపు టారిఫ్‌లను విధిస్తున్నట్లు ఇటీవల అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో న్యూదిల్లీపై మొత్తం సుంకాలు 50శాతానికి పెరిగాయి. ఈ టారిఫ్‌లతో భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై వెంటనే ప్రభావం పడనుంది. భారత్ నుంచి ఎగుమతయ్యే అతికొద్ది వస్తువులకే ఈ అధిక సుంకాల నుంచి మినహాయింపు ఉంది. ఈ అదనపు సుంకాలపై ఇప్పటికే భారత్ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇది అనుచితం, అన్యాయం, అహేతుకం' అని స్పష్టంచేసింది. ఈ విషయంలో దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. మరోవైపు, సోమవారం ప్రధాని మోదీ కూడా దీనిపై స్పందించారు. రైతులు, పశుపోషకులు, చిన్నతరహా పరిశ్రమల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఈవిషయంలో తమపై ఒత్తిడి పెరగొచ్చని.. కానీ దానిని భరిస్తామని స్పష్టంచేశారు.

# నేటి నుంచి ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



- **విజయదశమి పర్వదినంతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్ల ప్రస్థానం**
- **ఆగస్టు 26 నుంచి 28 వరకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మూడు రోజులపాటు కార్యక్రమాలు**
- **సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ ఉపన్యాసాల పరంపర**
- **సుమారు 2000 మందికి పైగా ప్రముఖులకు ఆహ్వానాలు**
- **ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు వంటి మైనారిటీ వర్గాలకూ..**

**జనం పవర్, హైదరాబాద్ :**

విజయదశమి పర్వదినంతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోబోతోంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సంఘ్ సిద్ధమవుతోంది. ఆగస్టు 26 నుంచి 28 వరకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాలతో శతాబ్దీ వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ సందర్భంగా సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ ఉపన్యాసాల పరంపరను ప్రారంభించనున్నారు. సంఘ్ ప్రస్థానం, సమాజంపై దాని ప్రభావం, భవిష్యత్తు దిశపై చర్చించడానికి ఈ సదస్సు వేదిక కానుంది. ఇప్పటికే క్రీడలు, కళలు, మీడియా, స్టార్టప్‌లు, న్యాయవాదులు, అధికారులు, ఆలోచనాపరులు, రాజకీయ నాయకులు, దౌత్యవేత్తలు వంటి విభిన్న రంగాల నుంచి సుమారు 2000 మందికి పైగా ప్రముఖులకు ఆహ్వానాలు పంపించారు. ప్రత్యేకంగా కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీల నాయకులను కూడా ఆహ్వానించడం విశేషం. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు వంటి మైనారిటీ వర్గాలకూ ఆహ్వానం పంపినట్టు సంఘ్ వర్గాలు వెల్లడించాయి. ఆగస్టు 26న జరిగిన చర్చల్లో ఆర్ఎస్ఎస్ 100 ఏళ్ల ప్రయాణంపై సమీక్ష ఉంటే, రెండవ రోజు భవిష్యత్తు దృక్కోణంపై చర్చ, మూడవ రోజు మోహన్ భగవత్‌తో ప్రశ్నోత్తరాల కార్యక్రమం ఉండనుంది.

# రైతులు ధర్నాలు చేస్తుంటే.. సీఎం, మంత్రులు ఎక్కడ?: కేటీఆర్

**జనం పవర్, హైదరాబాద్ :**

యూరియాను కాంగ్రెస్ ఎంపీలు తేలేరు.. భాజపా ఎంపీలు అడగరు అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రైతులు యూరియా కోసం అనేక పాట్లు పడుతున్నారని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''యూరియా కోసం రైతులు ధర్నాలు చేస్తుంటే.. సీఎం మంత్రులు ఎక్కడున్నారు ?సమస్యలు ఇక్కడుంటే సీఎం, మంత్రులు ఉండేది దిల్లీ, బిహార్‌లలోనా?జాతీయ పార్టీలకు ఓట్లు.. రాష్ట్ర ప్రజలకు పాట్లు'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# మాతో పోటీపడితే చైనాకు వినాశనమే

- **చైనా కంటే తమ ఆధిపత్యమే ఎక్కువ**
- **రేపటి నుంచే అదనపు సుంకాలు.. భారత్‌కు నోటీసులిచ్చిన అమెరికా**
- **కిమ్‌తో భేటీకి తాను కూడా ఎదురుచూస్తున్న**
- **అమెరికా టెక్ కంపెనీలపై డిజిటల్ పన్నులపై ట్రంప్ అగ్రహం**
- **ఇది ఆగాలి. లేదంటే ఆయా దేశాలపై అదనపు టారిఫ్‌లు తప్పవు**
- **అమెరికా అధ్యక్షుడు ట్రంప్**



**జనం పవర్, హైదరాబాద్ :**

చైనాతో వాణిజ్యయుద్ధం గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజింగ్‌తో తాము గొప్ప సంబంధాలు కొనసాగించాలనుకుంటున్నట్లు తెలిపారు. అయితే, చైనా కంటే తమ ఆధిపత్యమే ఎక్కువన్నారు. ఈవిషయంలో పోటీకొస్తే బీజింగ్‌కు వినాశనం తప్పదని ట్రంప్ పరోక్షంగా హెచ్చరించారు.

''ఈ ఏడాది చివర్లో లేదా ఆ తర్వాత కొంతకాలానికి నేను చైనా పర్యటనకు వెళ్తా. ఇరుదేశాల మధ్య అద్భుత సంబంధాలు ఉండబోతున్నాయి. అయితే, ప్రస్తుతం కొనసాగుతున్న వాణిజ్య విభేదాల్లో బీజింగ్ కంటే వాషింగ్టన్ బలంగా ఉంది. వాళ్ల (చైనాను ఉద్దేశిస్తూ) వద్ద కొన్ని కార్డులు ఉన్నాయి. మా వద్ద అంతకంటే అద్భుతమైన కార్డులు ఉన్నాయి. కానీ, వాటితో నేను ఆడాలనుకోవట్లేదు. ఒకవేళ ఆడితే చైనా నాశనం అవుతుంది. అందుకే ప్రస్తుతానికి ఆ కార్డులు నేను ఆడను'' అని ట్రంప్ వెల్లడించారు.

**రేపటి నుంచే అదనపు సుంకాలు.. భారత్‌కు నోటీసులిచ్చిన అమెరికా**

ఆటోమొబైల్, రక్షణ రంగానికి అవసరమైన మ్యాగ్నెట్స్ సరఫరాను చైనా కొనసాగించాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు స్పష్టం చేశారు. ''ఆ మ్యాగ్నెట్‌స్‌ను మాకు ఇవ్వాల్సిందే. లేదంటే వారిపై 200శాతం టారిఫ్‌లు విధిస్తాం. దానివల్ల మాకు ఎలాంటి సమస్యా రాదు'' అని ట్రంప్ హెచ్చరించారు.

**కిమ్‌తో భేటీ అవుతా..**

మరోవైపు, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్‌తో ట్రంప్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మ్యూంగ్ మాట్లాడుతూ.. ''కొరియా ద్వీపకల్పంలో మీరు (ట్రంప్) శాంతిని పునరుద్ధరించగలరని విశ్వసిస్తున్నా. అప్పుడు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోన్ ఉన్‌తో మీరు భేటీ అవ్వొచ్చు'' అని అన్నారు. దీనికి ట్రంప్ బదులిస్తూ.. కిమ్‌తో భేటీకి తాను కూడా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాదిలోనే ఆ సమావేశం జరుగుతుందని ఆకాంక్షించారు. అందరికంటే కిమ్ గురించి తనకే ఎక్కువ తెలుసని అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. గతంలో ఉత్తరకొరియా అధినేతతో ట్రంప్ మూడుసార్లు భేటీ అయిన సంగతి తెలిసిందే.

అమెరికా టెక్ కంపెనీలపై పలు దేశాలు విధిస్తున్న డిజిటల్ పన్నులపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈమేరకు తన ట్రూత్ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ చేశారు. ''అమెరికా అధ్యక్షుడిగా మా టెక్ కంపెనీలపై పన్నుల రూపంలో జరుగుతున్న దాడులకు ఎదురునిలబడతా. డిజిటల్ పన్నులు, డిజిటల్ సర్వీసెస్ చట్టాలు, డిజిటల్ మార్కెట్ రెగ్యులేషన్స్ ఇలాంటి అమెరికా టెక్నాలజీకి హాని చేసేందుకు ఉద్దేశించినవే. చైనా కంపెనీలపై ఎలాంటి పన్నులు వేయకుండా విపక్షపూరితంగా అగ్రరాజ్య సంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇది ఆగాలి. లేదంటే ఆయా దేశాలపై అదనపు టారిఫ్‌లు తప్పవు. మా సంస్థలు మీకు పిగ్గీ బ్యాంకులు కావు. అమెరికాను, మా టెక్ కంపెనీలను గౌరవించండి. లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి'' అని ట్రంప్ హెచ్చరించారు.

# సాంప్రదాయ దుస్తులుంటేనే అనుమతులు

- **ఇంద్రకీలాద్రిలో కొత్త నిబంధనలు**

**జనం పవర్, హైదరాబాద్ :**

ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో భక్తుల కోసం అధికారులు కొత్త మార్గదర్శకాలు అమలు చేయనున్నారు. సెప్టెంబర్ 27 నుంచి ఆలయానికి వచ్చే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులు ధరించాల్సిందేనని స్పష్టంచేశారు. సంప్రదాయ వేషధారణ లేకపోతే ఆలయ ప్రవేశం నిరాకరించబడుతుందని తెలిపారు. ఇకపై ఆలయ ప్రాంగణంలో సెల్‌ఫోన్ల వాడకం పూర్తిగా నిషేధించబడింది. అంతరాలయంలో వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడం వంటి ఘటనలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆలయ సాంప్రదాయాలకు భంగం కలగకుండా కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రోటోకాల్ దర్శనాలకు వచ్చే వారు తమ ఫోన్లను ఆలయ ఆఫీసులో డిపాజిట్ చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. భక్తులు, సిబ్బందితో సహా అందరూ సంప్రదాయ దుస్తులు ధరించాల్సి ఉంటుందని, ఆలయ ఉద్యోగులు తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించాలని ఆదేశించారు. అలాగే స్కానింగ్ పాయింట్లు, టికెట్ కౌంటర్ల వద్ద కఠిన తనిఖీలు జరగనున్నాయి. డ్రెస్ కోడ్ పాటించని వారు లేదా సెల్‌ఫోన్లతో వచ్చే వారికి ఇకపై ఆలయంలో ప్రవేశం ఉండదని స్పష్టంచేశారు.

# భారత్‌కు అమెరికా సుంకాల నోటీసులు

- **అదనంగా 25 శాతం సుంకాలు విధింపు**

**జనం పవర్, హైదరాబాద్ :**



భారత్‌పై అమెరికా మరోసారి ఆర్థిక ఒత్తిడి పెంచింది. రష్యాతో చమురు వ్యాపారం కొనసాగిస్తున్నందుకు స్పందనగా, భారత్ నుండి దిగుమతికానున్న పలు ఉత్పత్తులపై అదనంగా 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారిక నోటీసును విడుదల చేసింది. తాజా సుంకాలు ఆగస్టు 27 అర్ధరాత్రి 12 గంటల నుండి అమల్లోకి రానున్నాయి.

**రష్యా చమురు వల్లే పెనుపరిణామాలు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఈ ఉత్తర్వుపై ఆగస్టు 6న సంతకం చేశారు. రష్యా ఫెడరేషన్ తీరును ఎదుర్కొనే చర్యల్లో భాగంగా, భారత్‌పై అదనపు ఆర్థిక భారం మోపాలని యూఎస్ అధికార సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. భారత ప్రభుత్వం రష్యా చమురును కొనుగోలు చేస్తూ, పరోక్షంగా ఉక్రెయిన్‌పై రష్యా దాడికి మద్దతు ఇస్తోందని అమెరికా అభిప్రాయపడుతోంది. ఇదే కారణంగా భారత్ దిగుమతులపై మొత్తం టారిఫ్ భారం 50 శాతానికి పెరిగింది. ప్రస్తుతం గిడ్డంగుల్లో ఉన్న స్టాక్‌లపైనా, గడువు తరువాత దిగుమతయ్యే ఉత్పత్తులపై కూడా ఈ సుంకాలు వర్తిస్తాయని నోటీసులో స్పష్టం చేశారు. ఇది కేవలం భారత్‌కే పరిమితమైనది కాదు. రష్యాతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న ఇతర దేశాలపైనా ఇదే విధంగా అదనపు ఆంక్షలు లేదా టారిఫ్‌లు విధించే అవకాశం ఉందని ట్రంప్ సంకేతాలిచ్చారు.

**భారత ప్రభుత్వ ఆగ్రహం**

ఈ చర్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది. "ద్వితీయ సుంకాలు" అంటూ అభివర్ణించిన భారత్ ప్రభుత్వం, ఇది అన్యాయమైనదే కాక, అసమంజసమైన చర్య అని విమర్శించింది. అయితే, చర్చల ద్వారా పరిష్కారం లభిస్తే సుంకాల్లో మార్పు వచ్చే అవకాశం ఉందని న్యూఢిల్లీ నమ్మకం వ్యక్తం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ అంశంపై స్పందిస్తూ, "వాషింగ్టన్ విధించిన ఆర్థిక ఒత్తిడిని లెక్కచేయదల్చుకోలేదు. మేము మాకే తగిన మార్గాన్ని కనుగొంటాం. ఎంత ఒత్తిడి వచ్చినా తట్టుకునే శక్తిని పెంచుకుంటాం," అని స్పష్టం చేశారు. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ ఇప్పుడు గట్టి పునాదులపై నిలిచిందని, దాని వెనుక రెండు దశాబ్దాల కృషి ఉందని ఆయన పేర్కొన్నారు. విదేశీ ఒత్తిడులకు లోనుకాకుండా దేశం స్వయం సమర్థతతో ముందుకు సాగుతుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భారత్-అమెరికా వాణిజ్య సంబంధాల్లో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తనున్న సూచనలు కనిపిస్తున్నాయి. టారిఫ్‌లు, వ్యూహాత్మక ఒత్తిళ్లు, చర్చలు... ఈ త్రిముఖ సమీకరణం ఎలా పరిణమించనుందో వేచి చూడాల్సిందే.

# ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్నలు

**జనం పవర్, హైదరాబాద్ :**

అందజేసేలా జిల్లాల కలెక్టర్లను ఆదేశించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)కి ఉత్తర్వులు జారీ చేశారు. భూముల రిజిస్ట్రేషన్‌లకు వెళ్లినపుడు నిషేధిత జాబితాలో ఉన్నాయంటూ సబ్‌రిజిస్ట్రార్లు తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు. ఇలాంటి పిటిషన్లు 5100కు పైగా ఉన్నాయని, నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలను సబ్‌రిజిస్ట్రార్‌లకు అప్పగించాలంటూ పదేళ్ల క్రితం ఫుల్‌బెంచ్ తీర్పు ఇచ్చినా ఎందుకు అమలు చేయలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు.

**వివాదాల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశాం: ప్రభుత్వం**

నిషేధిత భూముల వివాదాలపై త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తూ ఈ నెల 23న జీవో 98 జారీ చేసినట్లు ప్రభుత్వ న్యాయవాది కట్రం మురళీధర్‌రెడ్డి తెలిపారు. సెక్షన్ 22ఏకు సంబంధించి నిషేధిత భూముల వివాదాలపై అందిన ఫిర్యాదులను కమిటీ పరిశీలిస్తుందని తెలిపారు. రికార్డులను పరిశీలించి నిషేధిత జాబితా నుంచి తొలగించడం, నిర్ధారించడం, సవరించడం వంటి ఆదేశాలు జారీ చేస్తుందని... దీనికి ఫిర్యాదుదారు, ప్రభుత్వం కట్టుబడి ఉండాల్సిందేనన్నారు. దీనిపై ఏదైనా వివాదం ఉంటే సివిల్ కోర్టును ఆశ్రయించాల్సి ఉంటుందన్నారు. ఈ కమిటీ మూడేళ్లపాటు కొనసాగుతుందని, కనీసం నెలకోసారి సమావేశమై సమీక్షించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో అమలయ్యేలా చూడాలని పేర్కొన్నారు. అయితే నిషేధిత భూముల జాబితాను సబ్‌రిజిస్ట్రార్‌లకు 9 వారాల్లోగా అందించాలన్నారు. దీనికి సంబంధించి కలెక్టర్లకు జారీ చేసిన ఉత్తర్వులు, అమలు తీరుపై 10 రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో సీఎస్ వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. విచారణను సెప్టెంబరు 3వ తేదీకి వాయిదా వేశారు.

**నిషేధిత భూములపై పాస్‌బుక్‌లు ఎలా జారీ అయ్యాయి?**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో సర్వే నం.194, 195లలోని భూములు నిషేధిత జాబితాలో ఉండగా ప్రైవేటు వ్యక్తులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఎలా జారీ అయ్యాయో వివరాలు సమర్పించాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఆ రెండు సర్వే నంబర్లలో దాదాపు 50 ఎకరాల భూదాన్ భూములకు అబ్దుల్ జావీద్, అర్షియా సుల్తానా, అబ్దుల్ లతీఫ్ తదితరుల పేర్లతో పాస్‌బుక్‌లు జారీ చేసిన అప్పటి తహసీల్దార్ టి.సుబ్రమణ్యంపై చర్యలు తీసుకోవాలంటూ బి.మల్లేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఆ సర్వే నంబర్లలోని 700 ఎకరాలను ప్రభుత్వ భూములుగా పేర్కొన్నారని, 2018 వరకు నిషేధిత జాబితాలో ఉన్నాయని తెలిపారు. 2019లో రెవెన్యూ రికార్డుల్లో లేని వ్యక్తుల పేర్లతో అప్పటి తహసీల్దార్ పట్టా పాస్‌బుక్‌లు జారీ చేశారన్నారు. సర్వే నం.194లోని భూములను పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కొనుగోలు చేయడంతో వివాదాస్పదమైందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి... పాస్‌బుక్‌లు ఎలా జారీ అయ్యాయన్న వివరాలు సమర్పించాలని ప్రభుత్వ న్యాయవాది కె.మురళీధర్‌రెడ్డిని ఆదేశిస్తూ విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.



# మట్టి గణపతులను పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం

**జనం పవర్, మంథని, ఆగస్టు 26:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంథనిలో ఐక్యూఏసీ , ఎన్ఎస్ఎస్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులతో ఎకో ఫ్రెండ్లీ మట్టి గణపతుల ను తయారు చేయించి వారిలో ప్రకృతి పట్ల అవగాహనను కలిగించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమం లో భాగంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పండుగను ఎకో ఫ్రెండ్లీగా జరుపుకోవాలని మట్టి గణపతులను పూజించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, అధ్యాపకులు అమర్నాథ్, ముకుంద, కృష్ణ, శేఖర్, శ్రీధర్, మానస, ఫర్జానా, రజిత, బోధనేతర సిబ్బంది శ్రీనివాస్, దుర్గరాజు, సురేష్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి



- **రామగుండం పోలీస్ కమిషనర్**

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 26:**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రజల విశ్వాసాన్ని పొందేలా బాధ్యతతో పని చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన బసంత్ నగర్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. కమిషనర్‌కు అధికారులు పూలమొక్కలతో స్వాగతం పలికగా,అనంతరం రిసెప్షన్,సిసిటిఎన్ఎస్ విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు.సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌పై సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు,పెండింగ్ కేసులు,కోర్టు కేసులు,దర్యాప్తులో ఉన్న కేసులను సమీక్షించి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు,అనుమానితులు,కేడీలు,డిసిలు,మిస్సింగ్ కేసులు,ఆస్తి నేరాలకు సంబంధించిన వివరాలను పరిశీలించి,శాఖపరమైన సమస్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ,నిబద్ధతతో పనిచేస్తేనే ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని,ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతోపాటు మర్యాదపూర్వకంగా ఫిర్యాదులు ఆలకించడం ప్రతి అధికారిపై ఉన్న బాధ్యత అని సీపీ పేర్కొన్నారు.ఈ తనిఖీల్లో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్,పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్,బసంత్ నగర్ ఎస్ఐ స్వామి పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకై మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలి



- **ఎమ్మెల్యే విజయ రమణారావు విజ్ఞప్తి**

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 26:**

పెద్దపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని ప్రజలకు సూచించారు.పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో మట్టి గణపతుల విగ్రహాలను పంపిణీ చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ,మట్టి వినాయకులను చెరువుల్లో నిమజ్జనం చేసినప్పుడు అవి త్వరగా కరిగిపోవడం వల్ల నీటిలో జీవించే జీవరాశులకు ఎలాంటి హాని కలగదని వివరించారు.పర్యావరణాన్ని కాపాడే దిశగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని,ఈ విషయాన్ని స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలని ఆయన కోరారు.ఇలాంటి చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మరియు వారి సిబ్బందికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప,మాజీ కౌన్సిలర్లు,మెప్మా ఆర్పీలు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానికతపై మాట్లాడే అర్హత రవిశంకర్‌కు లేదు

- **కాంగ్రెస్ నేతల ధ్వజం**

**జనం పవర్,గంగాధర ఆగస్టు 26:**




చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్‌పై కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. ముంపు గ్రామాల ఐక్యవేదిక అధ్యక్షుడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ మాట్లాడుతూ – ముంపు గ్రామాల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు రవిశంకర్‌కు లేదని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రూపాయి పరిహారం కూడా అందకపోయినా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషితో 234 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరైన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ – రవిశంకర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఎమ్మెల్యే సత్యంపై ఆరోపణలు చేయడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రజాహిత యాత్ర విజయవంతం కావడంతో బీఆర్ఎస్‌లో భయం మొదలైందన్నారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ – ఐదేళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్న రవిశంకర్ నియోజకవర్గానికి ఏమాత్రం అభివృద్ధి చేయలేదని, సాగు నీరు తెప్పించిన ఘనత మాత్రం మేడిపల్లి సత్యానిదేనని స్పష్టం చేశారు. రవిశంకర్ స్థాయి బూరుగుపల్లి వరకు మాత్రమేనని ఆయన వ్యంగ్యంగా పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ మాట్లాడుతూ – స్థానికతపై మాట్లాడే అర్హత రవిశంకర్‌కు లేదని, ప్రజాస్వామ్యంలో ఎక్కడి నుంచైనా పోటీ చేసే హక్కు రాజ్యాంగం ఇస్తుందని గుర్తుచేశారు. ముంపు గ్రామాల సమస్యలపై పోరాడి ఏఐసీసీ స్థాయిలో కూడా ప్రశంసలు తెచ్చింది మేడిపల్లి సత్యమేనని వివరించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొయిని ఎల్లేష్, గంగాధర సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, జాగిరపు శ్రీనివాస్ రెడ్డి, సత్తు కనుకయ్య, సాగి అజయ్ రావు, వేముల అంజి, మ్యాక వినోద్, ముద్దం నగేష్, దూలం విరేశం, పెంచాల చందు, దోమకొండ మధు, నాగుల వంశి, కూమార్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో ఖాళీలు..

- **స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం**

**జనం పవర్, హైదరాబాద్ :**

తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ఇటీవల 202526 విద్యా సంవత్సరానికి మోడల్ స్కూల్స్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షను నిర్వహించారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినా దాదాపు 48వేలకు పైగా సీట్లు ఇంకా ఖాళీగా ఉన్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో 48,630 సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. అత్యధికంగా ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 13,256 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 12,668 సీట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆరో తరగతికి సంబంధించి 7,543 సీట్లు, ఏడో తరగతిలో 5,192 సీట్లు, 8వ తరగతి 3,936 సీట్లు, 9వ తరగతి 2,884 సీట్లు, పదో తరగతిలో 3,151 సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మోడల్ స్కూల్స్‌లో సీట్లు కావాలనుకునే వారు నేరుగా పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపల్‌ను కలవాలని సూచించారు

# మండపాలకు తరలుతున్న వినాయక విగ్రహాలు

- **పల్లెల్లో మొదలైన గణపతి నవరాత్రుల కోలాహలం**

**జనం పవర్, మంథని, ఆగస్టు 26:**



గణపతి నవరాత్రి ఉత్సవాలకు అంతా సిద్ధమైంది. గత 20 రోజుల క్రితం నుంచే గణపతి విగ్రహాలకు డబ్బులు చెల్లించిన వారు మంగళవారం తమతమ గ్రామాలకు విగ్రహాలను తరలిస్తున్నారు. మంథని పట్టణంలో నాలుగు చోట్ల వినాయక విగ్రహాల తయారీ అమ్మకాలు జరుగుతున్నాయి. విగ్రహం ఆకారం, అలంకరణను బట్టి ధర నిర్ణయిస్తున్నారు. ఓ మాదిరి విగ్రహాలు రూ. 5000 నుంచి మొదలుకొని రూ. 50వేల వరకు పలుకుతున్నాయి. గణపతులను నెలకొల్పేందుకు గ్రామాలలోని యువకులు ఉత్సాహపడుతున్నారు. ఇప్పటికే దాతల నుంచి విగ్రహాలు కొనుగోలు నుంచి నవరాత్రుల వరకు పూజలు, భజనలు, డీజేలు, ఖర్చులకు డబ్బులు సమకూర్చుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ కొరకు మట్టి విగ్రహాలను నెలకొల్పుకోవాలని అధికారులు కోరుతున్నారు. కొన్ని చోట్ల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. మండపాలను ఎక్కడ, ఎలా ఏర్పాటు చేసుకోవాలో తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని పోలీసులు మండప నిర్వాహకులను పిలిచి అవగాహన కల్పించారు. అనుమతులు తీసుకున్న మండపాలకు మాత్రమే ప్రభుత్వం ఉచిత కరెంటు సరఫరా చేస్తుందని ప్రకటించారు. మండపాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు, కరెంట్ షాక్ సర్క్యూట్ జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహాల ప్రతిష్ట నుంచి నిమజ్జనం వరకు క్రమబద్ధంగా వ్యవహరించాలని అధికారులు నిర్వాహకులకు చెబుతున్నారు. డీజెలకు అనుమతి లేదని పోలీసులు ముందస్తుగానే తెలిపారు. మైకులను ఏర్పాటు చేసుకొని శబ్ద కాలుష్యం లేకుండా తక్కువ మోతాదులో శబ్దం వచ్చేలా పరికరాలు సమకూర్చుకోవాలని పోలీసులు తెలిపారు. భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను పండగ వాతావరణం లో జరుపుకోవాలని అన్నారు. నిమజ్జనం రోజు గొడవలు జరగకుండా మండప నిర్వహకులు క్రమ పద్ధతిలో తమ విగ్రహాలను అందుబాటులోని చెరువులు, కుంటలు, ఇతర జలాశయాలు, గోదావరి నదిలో నిమజ్జనం చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా మండపాల వద్ద ఎవరు వ్యవహరించిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# బేకరిలో పని చేసే కాసు అజయ్ కి మెరుగైన వైద్యం అందించి నష్టపరిహారం ఇప్పించాలి

- **మంథని సహాయ కార్మికశాఖ అధికారికి ప్రజాసంఘాల వినతి**

**జనం పవర్, మంథని, ఆగస్టు 26:**



మంథని పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వీట్ హౌస్ లో పనిచేస్తున్న కార్మికుడు కాసు అజయ్ గత వారం రోజుల క్రితం బిల్డింగ్ పై నుండి పడిపోయి తీవ్రమైన గాయాలు కావడం జరిగింది. అతనికి రెండు కాళ్లు విరిగి వెన్నెముక దెబ్బ తినడం జరిగింది.ఈ విషయంపై మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంథని సహాయ కార్మిక శాఖ అధికారి రవీందర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ మంథని మండలం బిట్టుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కార్మికుడు కాసు అజయ్ గత కొంతకాలంగా స్వీట్ హౌస్ లో పనిచేస్తున్నాడని శ్రీ వెంకటేశ్వర స్వీట్ హౌస్ యజమాని స్వీట్ హౌస్ పనులే కాకుండా కార్మికులను సొంత ఇంటి పనులకు బిల్డింగ్ నిర్మాణ పనులకు ఉపయోగించు కుంటున్నారని అన్నారు. కార్మికులకు చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ కార్మికులను శ్రమదోపిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్మికులతో సమయానికి మించి పనిచేయిస్తున్నాడని అన్నారు. రాత్రి పదకొండు గంటల వరకు కార్మికులతో బేకరీ పనులతో పాటు ఇతర పనులను చేయిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాసు అజయ్ అనే కార్మికుడు స్వీట్ హౌస్ పనులే కాకుండా యజమాని ఇంటి వద్ద అన్ని రకాల పనులు చేస్తున్నాకార్మిక శాఖ నిబంధనలకు విరుద్ధంగా యజమాని కార్మికులచే పని చేయిస్తున్నాడని విమర్శించారు. ఈ క్రమంలోనే ఇంటి యజమాని బిల్డింగ్ నిర్మాణ పనులు చేస్తుండగా అజయ్ అనే కార్మికుడు ప్రమాదవశాత్తు బిల్డింగ్ పై నుండి పడిపోవడం జరిగిందని అన్నారు.ఈ సంఘటనపై సమగ్రమైన విచారణ జరిపి కార్మికునికి మెరుగైన వైద్యం అందించాలని యజమాని చేత కార్మికుని కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించి నిరుపేద కార్మిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్ ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల వేళ

- **నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్**

**జనం పవర్, హైదరాబాద్, ఆగస్టు 26:**




తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ క్రమంలో నోటిఫై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని జిల్లా పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణ కోసం షెడ్యూల్ సైతం విడుదల చేసింది.

అయితే ఆగస్టు 28వ తేదీ లోపు గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ చేసి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఇక ఆ మరునాడే.. అంటే ఆగస్టు 29వ తేదీన ఎంపీడీవోల ద్వారా మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 30వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తామని ఎన్నికల సంఘం వెల్లడిరచింది. అలాగే ఆగస్టు 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఫొటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురణ చేస్తారని ఎన్నికల సంఘం తెలిపింది.

ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. గతంలో గడువు ముగిసినా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదంటూ పలువురు తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది.2024, జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. దీంతో ఏడాదిన్నరగా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువరించింది.

## పవర్‌ఫుల్ షో కి మోదీని స్వయంగా ఆహ్వానించనున్న జిన్‌పింగ్..!

**జనం పవర్, హైదరాబాద్ :**



ఆగస్టు చివర్లో తియాంజిన్ వేదికగా జరగనున్న షాంఘై సహకార సదస్సు లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ చైనా వెళ్తున్నారు. ఈ సదస్సు సందర్భంగా మోదీతోపాటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వయంగా ఆహ్వానించనున్నారట. అమెరికా టారిఫ్‌ల వేళ.. గ్లోబల్ సౌత్ దేశాలకు (వర్ధమాన దేశాలు) సంఘీభావంగా శక్తివంతమైన ప్రదర్శనలో భాగంగానే ఈ చర్య ఉండనుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మోదీ, పుతిన్‌తో పాటు మధ్య, పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల నేతలకు ఈ ఎస్‌సీఓ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ ఒకటి మధ్య తియాంజిన్ వేదికగా ఈ సదస్సు జరగనుంది. ప్రధాని మోదీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. అనంతరం చైనా అధ్యక్షుడు 2019లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్‌చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ భేటీ అయిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడుతోన్న వేళ.. మోదీ చైనా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సుంకాలను డ్రాగన్ ఖండించింది. వాణిజ్య, సుంకాల యుద్ధాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో భారత్ వెన్నంటి నిలుస్తామని ప్రకటించింది. మరోపక్క దిల్లీలోని రష్యా రాయబారి మాట్లాడుతూ.. భారత్, చైనాతో కలిపి త్వరలో త్రైపాక్షిక చర్చలు జరుగుతాయని భావిస్తున్నట్లు మీడియాతో వెల్లడించారు. ఆ సదస్సు వేళ ఈ ముగ్గురు నేతల మధ్య సమావేశం జరగొచ్చని తెలుస్తోంది. కాగా..''చైనా, ఇరాన్, రష్యా.. ఇప్పుడు భారత్‌పై వాషింగ్టన్ తీసుకుంటున్న చర్యలు ఎలాంటి ప్రభావం చూపలేదు. ఈ తరుణంలో అమెరికా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ క్రమం ఎలా ఉండనుందో తెలియజేసేందుకు జిన్‌పింగ్ ఈ సదస్సును ఉపయోగించుకోవాలని అనుకుంటున్నారు'' అని చైనా గ్లోబల్ సౌత్ ప్రాజెక్ట్ ఎడిటర్ ఇన్ చీఫ్ ఎరిక్ ఒలాండర్ అభిప్రాయపడ్డారు. ఎస్‌సీఓ చరిత్రలో ఇదే భారీ సమావేశంగా నిలుస్తుందని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఇప్పటికే వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

## సెప్టెంబరు 7న శ్రీవారి ఆలయం మూసివేత

**జనం పవర్, హైదరాబాద్ :**

చంద్ర గ్రహణం కారణంగా సెప్టెంబరు 7న దాదాపు 12 గంటల పాటు శ్రీవారి ఆలయం మూసివేయనున్నట్టు తితిదే ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబరు7న రాత్రి 9.50 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై.. అర్ధరాత్రి 1.31 గంటలకు ముగుస్తుంది. సాధారణంగా గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. సెప్టెంబరు 8న ఉదయం 3 గంటలకు సుప్రభాతంతో ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన సేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు. 8వ తేదీ ఉదయం 6 గంటల నుంచి శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. చంద్రగ్రహణం కారణంగా వచ్చే నెల 7న(ఆదివారం) ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను తితిదే రద్దు చేసింది. అదే రోజు సాయంత్రం 3 గంటల నుంచి తిరుమలలో అన్నప్రసాద వితరణ ఉండదు. సెప్టెంబరు 8న ఉదయం 8.30 గంటలకు అన్నప్రసాదాల పంపిణీ పునః ప్రారంభించనున్నట్టు తితిదే తెలిపింది. భక్తుల సౌకర్యార్థం ముందస్తుగా తితిదే అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో 30వేల పులిహోర ప్యాకెట్లను సెప్టెంబరు 7న సాయంత్రం నుంచి పంపిణీ చేయన్నట్టు అధికారులు తెలిపారు.

## సాదాబైనామాలపై హైకోర్టు గ్రీన్ సిగ్నల్



**జనం పవర్, హైదరాబాద్ :**

తెలంగాణలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అడ్డంకి తొలగింది. 2020 అక్టోబరు 12 నుంచి నవంబరు 10 వరకు స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించేందుకు తెలంగాణ హైకోర్టు అనుమతించింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణకు 2020 అక్టోబరు 10న రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ జీవోపై 2020 నవంబరులో ఉన్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. చట్టంలో అవకాశం లేకుండా ఎలా క్రమబద్ధీకరిస్తారని ప్రశ్నించింది. కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణ అంశం పొందుపరిచినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వ వివరణతో సంతృప్తి చెందిన ధర్మాసనం సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అంగీకరిస్తూ కేసు విచారణను ముగించింది.

## ఖరీఫ్ పంటల రిజిస్ట్రేషన్ ప్రారంభం



- **డీసీఎస్ రిజిస్ట్రేషన్ లేకుంటే ప్రభుత్వ కొనుగోళ్లు ఉండవు**
- **జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్**

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 26:**

ఖరీఫ్ పంటల సాగు లెక్కల నమోదు ప్రక్రియను ప్రభుత్వం డిజిటల్ విధానంలో చేపట్టిందని జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్ అన్నారు.వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) ప్రారంభమవగా,ఏఈవోలు ప్రత్యక్షంగా క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి,సాగు విస్తీర్ణం,పంటల వివరాలు,ఫోటోలు సేకరించి ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు.రైతులు తమ భూముల్లో ఏ పంట సాగు చేశారో తప్పనిసరిగా అదే పంటను నమోదు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ఇకపై పంటల కొనుగోళ్లు కూడా ఈ నమోదు వివరాలపై ఆధారపడి మాత్రమే జరగనున్నాయి.ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో మొత్తం 248116 ఎకరాల్లో పంటలు సాగు కాగా,వాటిలో వరి 198310 ఎకరాల్లో,పత్తి 49,254 ఎకరాల్లో,మొక్కజొన్న 448 ఎకరాల్లో ,కందులు 95 ఎకరాల్లో,వేరుశెనగ 4 ఎకరాల్లో,ఆయిల్ ఫామ్ 293 ఎకరాల్లో సాగుదలచగా,మిగతా భూభాగంలో కూరగాయల సాగు కొనసాగుతోంది. సర్వే ప్రక్రియ నెలన్నర పాటు కొనసాగి సెప్టెంబర్ చివరి నాటికి పూర్తికానుందని అధికారులు వెల్లడించారు.రైతులు తమ పంటల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా పూర్తి చేసి ఏఈవోలతో సహకరించాలని వ్యవసాయశాఖ కమిషనర్ ఇప్పటికే సూచనలు జారీ చేశారు.



## ఇంటింటికి త్రాగునీటి సరఫరా తప్పనిసరి

- **జిల్లా కలెక్టర్ ఆదేశం!**

**జనం పవర్, పెద్దపల్లి ఆగస్టు 26:**

పెద్దపల్లి పట్టణంలో ప్రతిరోజూ త్రాగునీటి సరఫరా జరగేలా కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పనితీరుపై సమీక్ష నిర్వహించిన ఆయన మాట్లాడుతూ ,చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో 30 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్లపై నల్లనీరు వృథాగా వదిలే వారి నీటి కనెక్షన్లు తొలగించాలన్నారు.పట్టణంలో చీకటి ప్రదేశాలు లేకుండా అవసరమైన విద్యుత్ స్తంభాలు,లైట్లు ఏర్పాటు ప్రతిపాదనలు పంపాలని,ఓపెన్ ట్రాన్స్ఫార్మర్లు తొలగించడంతో పాటు థర్డ్ వైర్ సమస్యను విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలన్నారు.ప్రతి ఇంటికి చెత్త సేకరణను 100% స్థాయిలో నిర్వహించడంతో పాటు,రెండు నెలల్లో తడి చెత్త,పొడి చెత్త వేర్వేరుగా సేకరించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు.బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే భారీ జరిమానాలు విధించాలని హెచ్చరించారు.కాలువలు,ప్రధాన రహదారులు,బహిరంగ ప్రదేశాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని,వర్షాకాలంలో ప్రతిరోజు ఫాగ్గింగ్ నిర్వహించాలని ఆదేశించారు.వినాయక నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా సాగేందుకు తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు మండపాల వద్ద పరిశుభ్రత కచ్చితంగా పాటించాలన్నారు.ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్,ఏఈ సతీష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మట్టి గణపతులనే పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం



- **గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్**

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 26:**

పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల తయారీ,ప్రదర్శన మరియు పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది.విద్యార్థులు స్వయంగా మట్టి వినాయకులను తయారు చేస్తూ సృజనాత్మకతను ప్రదర్శించగా,గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ మట్టి విగ్రహాలు నీటిలో త్వరగా కరిగి పర్యావరణానికి హాని కలిగించవని,చేపలు మరియు జలచర జీవరాశులకు ఎలాంటి ప్రమాదం ఉండదని చెప్పారు.కరెస్పాండెంట్ అల్లెంకి రజనీ శ్రీనివాస్ వినాయక చవితి విశిష్టతను వివరిస్తూ,ఈ పండుగ ద్వారా పిల్లల్లో సాంస్కృతిక,ఆధ్యాత్మిక విలువలు పెంపొందుతాయని,వినాయకుడు విజ్ఞానం వినయం,సహనం,సృష్టి ప్రతీక అని అన్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా,అనంతరం పోషకులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తూ "ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు గుడ్‌బై - మట్టి గణపతులకే ప్రాధాన్యం" అనే సందేశాన్ని అందించారు.

## బిజెపి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**జనం పవర్,8వ కాలనీ, ఆగస్టు 26:**

8వ కాలనీ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో 250 మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజించాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలి

- ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి
- సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యమివ్వాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 26:** ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు ఎవరైనా సేవా దృక్పథంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులకు "క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పి.ఎన్.డి.టి చట్టం" పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు తప్పని సరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర మార్గాలు, లిఫ్టులు ఉన్నచోట అదనపు మెట్ల మార్గాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. 10 మంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉంటే ఐసీసీ కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రైవేటు అంబులెన్స్‌లను వారి ఆసుపత్రుల్లోనే నిలుపుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నిలిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ శాఖకు చెల్లించాల్సిన ఆస్తి పన్నులను విధిగా చెల్లించాలని అన్నారు.

సిజేరియన్ కాన్పులలో కరీంనగర్ ముందుండడం బాధాకరమైన విషయమని అన్నారు. అనవసరంగా సిజేరియన్లు చేయకూడదని, సాధ్యమైనంత వరకు నార్మల్ డెలివరీలకు ప్రయత్నించాలని సూచించారు. లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు వంటివి వెలుగు చూస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సాధారణ డెలివరీలలో ప్రభుత్వ ఆసుపత్రులు ముందు వరుసలో ఉన్నాయని తెలిపారు. గత ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 12 శాతం డెలివరీలు పెరిగాయని తెలిపారు. ప్రతినెలా ఆన్లైన్లో సమర్పించాల్సిన ఓపీ, ఐపీ తదితర నివేదికలను 5వ తేదీ లోపు సమర్పించాలని అన్నారు. అన్ని ప్రైవేట్ ఆస్పత్రులలోనూ ఆరోగ్య మహిళ ఉచిత వైద్య సేవలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా లభించే మందుల వివరాలు డిస్ప్లే చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నరేష్, ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు, వైద్యులు పాల్గొన్నారు.

## 2 నుంచి ధర్మపురి మండల పాఠశాల క్రీడలు



**జనం పవర్, ధర్మపురి, ఆగస్టు 26:** ధర్మపురి మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో సీతాలక్ష్మి అధ్యక్షతన మండల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల క్రీడల తేదీలను ఖరారు చేశారు. సెప్టెంబర్ 2న అండర్ 14, అండర్ 17 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు, సెప్టెంబర్ 3న అండర్ 14, 17 బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు, సెప్టెంబర్ 4వ తేదీన అండర్ 14, అండర్ 17 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు.

ఈ క్రీడలను ధర్మపురి ఉన్నత పాఠశాల మైదానం లో నిర్వహించనున్నారు. అండర్ 14లో పాల్గొనే విద్యార్థులు 1.1.2012 తర్వాత జన్మించినవారు, అండర్ 17లో పాల్గొనే విద్యార్థులు 1.1.2009 తర్వాత జన్మించినవారు ధ్రువీకరణ పత్రాలతో రావాలని సూచించారు. వివరాలకు మండల కన్వీనర్ పీడీ కవిత 8985653380ను సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఫిజికల్ డైరెక్టర్లు అటుకుల స్వప్న, మహమ్మద్ అఫ్సర్, వరలక్ష్మి, భారతి, సౌజన్య పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణ ప్రతి విద్యార్థి బాధ్యత

**జనం పవర్, భైంసా, ఆగస్టు 26:** భైంసా పట్టణ కేంద్రంలో ఉన్న గోపాల రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో 100 మొక్కలను అధ్యాపకులు, విద్యార్థులు నాటారు. ఈ సందర్భంగా డిగ్రీ ప్రిన్సిపల్ కర్రోల బుచ్చయ్య మాట్లాడుతూ.. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణను ప్రతి విద్యార్థి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మొక్కలతోనే ప్రకృతి బాగుంటుందన్నారు. అదేవిధంగా ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఓం ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ రఘునాథ్, డాక్టర్ సంజీవ్ కుమార్, రాజు, అంబుదాసు, వనజ, యోగేష్, అధ్యాపకుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నగర సమస్యల పరిష్కారమే ధ్యేయం..

**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**



**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 26:** కరీంనగర్ లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. కరీంనగర్ అభివృద్ధికి కంకణం కట్టుకున్నానని అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. నేనున్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అహ్మద్ పురా, హుస్సేన్ పుర, విజయపురి కాలనీ, సిటిజన్ కాలనీ, రాజీవ్ చౌమాన్ తదితరుల ప్రాంతాల్లో రాజేందర్ రావు పర్యటించారు, ఈ సందర్భంగా ఆయా కాలనీల వాసులు స్థానిక ప్రజలను కలుసుకొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను రాజేందర్ రావు దృష్టికి తీసుకొచ్చారు. కరీంనగర్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కరీంనగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరానని తెలిపారు. రాష్ట్రంలోనే కరీంనగర్‌ను అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చెప్పారని, అందుకోసం నిధులు కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దశలవారీగా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాజేందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, కష్ట సుఖాల్లో తోడునీడగా ఆత్మీయుడిగా మెదులుతానని పేర్కొన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలని వాటిని అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాజేందర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో బీఆర్ఎస్ ధర్నా



**జనం పవర్, ధర్మపురి, ఆగస్టు 26:** ధర్మపురి మండల కేంద్రంలోమంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు యూరియా కోసం ధర్నా చేశారు. పంటలకు అత్యవసరమైన ఎరువులు సమయానికి అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు తెలిపారు. రైతులు అల్లాడుతున్నా, యూరియా కోసం క్యూల్లో నిలబడి బాధపడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కళ్లు మూసుకుని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇది కాంగ్రెస్ అసమర్థత పాలనకు నిదర్శనమని, ఎరువులు సమయానికి అందజేయలేని ఈ ప్రభుత్వం రైతుల భవిష్యత్తును చీకటిలో నెడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు డీసీఎంఎస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్, సౌల భీమయ్య, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేను ఎంపీగా గెలవడానికి పిల్లలే కారణం

**ఓట్లేసింది పెద్దలే అయినా... ఓటేయించింది మాత్రం పిల్లలే**
**సైకిళ్ల పంపిణీతో టెన్త్ లో డ్రాపవుట్స్ రేట్ తగ్గుతోంది**
**మానకొండూరులో సైకిళ్లను పంపిణీ చేసిన కేంద్ర మంత్రి**





**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 26:** నేను ఎంపీగా గెలవడానికి పిల్లలే కారణమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మానకొండూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'మోదీ గిఫ్ట్' పేరుతో మంగళవారం నిర్వహించిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో బండి సంజయ్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానకొండూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి తోపాటు జిల్లా అదనపు డీఈవో, ఏసీపీ, ఎమ్మార్వో, ఎంపీడీవో తోపాటు బీజేపీ జిల్లా కరీంనగర్, పెద్దపల్లి అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, సంజీవరెడ్డి, కరీంనగర్ మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ "నాకు ఓట్లేసింది ఓటర్లే కానీ నాకు ఓటేయించింది మాత్రం పిల్లలే. ఓటేయించిన మీ కోసం ఏదైనా చేయాలనే ఉద్దేశంతోనే సైకిళ్లను పంపిణీ చేస్తున్నా. ప్రజా సంగ్రామ యాత్ర సందర్భంగా నిర్మల్ లోని ఓ ఊరిలో ఒక పిల్లవాడు సైకిల్ లేక స్కూల్ వెళ్లకుండా ఇంట్లోనే ఉంటే అతనిని పిచ్చివాడిగా ముద్రవేశారు. ఆ పిల్లవాడిని కదిలిస్తే సైకిల్ పై ఉన్న ఆకాంక్ష తెలిసింది. అట్లాగే పాదయాత్రలో పిల్లలు బడికి వెళ్లకుండా కాళ్లకు చెప్పుల్లేకుండా తిరుగుతూ పడ్డ బాధలను కళ్లారా చూసిన. పేద విద్యార్థుల కష్టాలులు తీర్చేందుకు శక్తివంతన లేకుండా క్రుషి చేస్తా. అందులో భాగంగానే టెన్త్ క్లాస్ విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్నా. డ్రాపవుట్స్‌తో స్కూళ్లలో డ్రాపవుట్స్ తగ్గిపోతోంది. త్వరలోనే 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేయాలని యోచిస్తున్నా." అని తెలిపారు.

**ఎంపీగా ఉన్నంత కాలం సైకిళ్లను పంపిణీ చేస్తా**

తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నంత కాలం ప్రభుత్వ పాఠశాలలు, శిశు మందిర్‌లో టెన్త్ చదివే విద్యార్థులందరికీ సైకిళ్లను పంపిణీ చేస్తానని సంజయ్ తెలిపారు. ఓట్ల కోసం, పేరు కోసం సైకిల్ ఇవ్వడం లేదు. విద్యార్థుల రెగ్యులర్‌గా స్కూల్ కు వెళ్లి బాగా చదువుకుని భవిష్యత్తులో బాగుపడాలనే ఉద్దేశంతోనే సైకిళ్లను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్ కేజీ నుండి 6వ తరగతి వరకు 'మోదీ కిట్స్' ను పంపిణీ చేస్తామన్నారు. ఒక స్కూల్ బ్యాగ్ తోపాటు వాటర్ బాటిల్, పెన్ను, పెన్సిళ్ల, నోట్ పుస్తకాలు, రబ్బర్‌ను 'మోదీ కిట్స్' పేరుతో అందిస్తామని, వాటిని వినియోగించుకుని బాగా చదువుకుని రాణించాలని విద్యార్థులను బండి సంజయ్ కోరారు.

## జమ్మికుంట మండలంలో వైద్య శిబిరాలు

**- మందుల పంపిణీ చేసిన వైద్యులు**

**జనం పవర్, జమ్మికుంట, ఆగస్ట్ 26:** జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నగురం గ్రామంలో డాక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 48 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ముగ్గురు జ్వర పీడీతులను గుర్తించి, వారి రక్త పూతల నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్ కి పంపించారు. ఆర్‌డిటి కిట్స్ ద్వారా మలేరియా, డెంగీ పరీక్షలు చేసారు. జగ్గయ్యపల్లి గ్రామంలో డాక్టర్ ఫర్హానుద్దీన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి 57 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసారు. పదకొండు మందికి ఆర్‌డిటి కిట్స్ ద్వారా మలేరియా, డెంగీ జాండిస్ పరీక్షలు చేసారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంలో డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ చందన ఆధ్వర్యంలో సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 94 మందికి దగ్గు, జలుబు, జ్వరం ఉన్న వారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసారు. అసంక్రమిత వ్యాధులు రక్త పోటు, మధుమేహం వ్యాధులు ఉన్న వారిని గుర్తించి, పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. పట్టణ పరిధిలోని దుర్గా కాలనీలో డాక్టర్ మహోన్నత పటేల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. ముగ్గురు జ్వర పీడితులకు రక్త నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణకు ల్యాబ్‌కు పంపించారు.

## పీసీసీ అధ్యక్షుడిపై బండి సంజయ్‌వి తొండి ఆరోపణలు

**సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 26:** పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పై కేంద్రమంత్రి బండి సంజయ్ చేస్తున్న ఆరోపణలన్ని తొండి ఆరోపణలని కాంగ్రెస్ కరీంనగర్ నగర కమిటీ అధ్యక్షుడు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు మంగళవారం కరీంనగర్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ చొప్పదండి నియోజకవర్గం రెండు రోజుల క్రితం రెండు రోజులుగా ఏఐసిసి ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్రలో భాగంగా వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పక్క దారి పట్టించడం బండికి వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు వాడిన మాటలకు అనవసరమైన రాద్ధాంతం చేసి బిజెపి నాయకులు వారి దిష్టిబొమ్మలు దహనం చేయడం తగదని అన్నారు. మేము దిష్టి బొమ్మలు, ఫ్లెక్సీలు కాలబెట్టడం మొదలు పెడితే మీరు తట్టుకోలేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని నరేందర్ రెడ్డి హెచ్చరించారు.

## మహేష్ కుమార్ గౌడ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొలకాని రాజు**

**జనం పవర్, జమ్మికుంట, ఆగస్ట్ 26:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కరీంనగర్‌లో జనహిత పాదయాత్ర పేరుతో జనద్రోహ యాత్ర చేపడుతున్నారని బీజేపీ నాయకులు విమర్శించారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ దొంగ ఓట్లతో కరీంనగర్‌లో గెలిచారని మహేష్ కుమార్ గౌడ్ మొన్న చొప్పదండిలో మాట్లాడిన మాటలు తన అవివేకానికి నిదర్శనం అని, కరీంనగర్ లో కార్పొరేటర్ స్థాయి నుంచి ఎంపీగా, రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ ప్రధానకార్యదర్శిగా, ఇప్పుడు కేంద్ర మంత్రిగా ప్రజా సమస్యలపై పోరాటం చేసి, జైళ్ళలో ఉంచిన భయపడకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడి ప్రజల మనసు గెలిచిన వ్యక్తి బండి సంజయ్ అని, అలాంటి వ్యక్తిపై దొంగ ఓట్లతో గెలిచారని అనడం కరీంనగర్ ప్రజలను అవమానించడమేనని, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బేషరతుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మహేష్ కుమార్ గౌడ్ దిష్టి బొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంకా విపక్షంలో ఉన్నట్లుగానే భావించి జనద్రోహ యాత్ర చేపడుతున్నారని విమర్శించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు కైలాసకొటి గణేష్, పల్లపు రవి, బచ్చు శివన్న, మోతె స్వామి, ఇటుకాల స్వరూప, రాకేష్ ఠాకూర్, మోడం రాజు, రాచపల్లి ప్రశాంత్, శ్రీవర్తి అఖిల్, ఉడుగుల మహేందర్, ముకుందా సుధాకర్, రామస్వామి, గట్టు రాకేశ్, అప్పాల రవిందర్, మురికి మహేష్, ఆకుల పోచయ్య, మదిరే శంకర్, సిరియాల విజయ్, మహేష్ పాల్గొన్నారు.



## 'శ్రీ రాగా'లో ఏకో ఫ్రెండ్లీ గణేష్ ఉత్సవం



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 26:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేదరబస్తీలో గల శ్రీ రాగా ప్లే అండ్ హై స్కూల్‌లో ఏకో ఫ్రెండ్లీ గణేష్ ఉత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ ఉత్సవాన్ని ముందుగా పాఠశాల కరస్పాండెంట్ వరప్రసాద్, డైరెక్టర్ కవిత గణేశుడికి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్లే స్కూల్ నర్సరీ నుండి 10వ తరగతి విద్యార్థులందరూ వారి ఇంట్లో తయారు చేసిన గణేషుడి మాస్కులను మొఖానికి పెట్టుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులలో మన సంస్కృతి సంప్రదాయాల గురించి అవగాహనను పెంచడమే శ్రీ రాగా ఉద్దేశమని కరస్పాండెంట్ వరప్రసాద్ అన్నారు. ప్లే స్కూల్ చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్సులు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, సర్వేశ్వర రావు, సురేష్ కుమార్, రేష్మా, కవిత, భువన ముస్కాన్‌లు పాల్గొన్నారు.

# ఆ ఉద్యోగులెక్కడ...?

**- నాయకుల వలే దర్పం**
**- ఆస్పత్రుల్లో వాళ్లదే ఇష్టారాజ్యం**
**-చూడనట్లు వదిలేస్తున్న అధికారులు..!**



**జనం పవర్, వరంగల్ బ్యూరో:**
వాళ్లు ఎవరికీ కనిపించరు.. రాజకీయ పార్టీ నాయకుల వలే దర్పం వెలగబెట్టుతారు. చదివిన చదువులకు ఉద్యోగాలు దొరక్క కష్టాలు పడుతున్న నిరుద్యోగులు ఎందరో ఉంటే. ఉద్యోగాలుండి డ్యూటీలకు రాకుండా కాలర్ ఎగరేసుకుంటూ తిరుగుతున్న వారెందరో.. అయితే వీళు మాత్రం ప్రతినెల క్రమం తప్పకుండా జీతాలు తీకుంటారు. ఇదేమని ఎవరైనా అడిగితే తాము ఉద్యోగ సంఘాల నాయకులమని ధీమా వ్యక్తం చేస్తారు. తమపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు అధికారులను మచ్చిక చేసుకుంటారు. ఎప్పుడోసారి ఇలా కనిపించి అలా వెళ్లిపోతారు. ఇంతకీ వారంతా చిన్న ఉద్యోగులేం కాదు కొందరు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు. వీళ్లను మందలిస్తే ధర్నాలు, ఆందోళనలు వంటి కార్యక్రమాలతో పరిపాలనను స్తంభింప జేస్తారని కొందరు అధికారులు భయపడి ఏమనకుండా వదిలేస్తారనే ఆరోపణలున్నాయి. ఈ సాకుతో కొందరు నాయకులకు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతూ వస్తోందనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఉద్యోగులు విధులకు హాజరు కాకుండా నెలల తరబడి కాలం వెల్లదీస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఇటువంటి ఉద్యోగులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో ఉన్నట్లు తెలిసింది.

**ప్రత్యేక కార్యక్రమాలకు హాజరు..!**
డ్యూటీలకు రాని కొందరు యూనియన్ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలకు పిలవని పేరంటంలా వచ్చి హడావుడి చేస్తారు. ముఖ్యంగా పెద్దసారు పుట్టినరోజని, కొత్త సారు ఎవరైనా బాధ్యతలు స్వీకరించే రోజు వంటి కార్యక్రమాలకు నిలువెత్తు పూల దండలు తెచ్చి అధికారికి వేసి శుభాకాంక్షలు తెలుపుతారు. ఇక్కడ కూడా యూనియన్ నాయకులదే పెత్తనం ఉంటుందని తోటి ఉద్యోగులు కొందరు వాపోయారు.

**ఇలా వచ్చి అలా వెళ్లి...!**
ఇలా వచ్చి అలా వెళ్లిపోయే కొందరు నాయకుల తీరు విమర్శలకు దారి తీస్తోంది. తాము పనిచేసే ఆస్పత్రిలోని పరిపాలన విభాగానికి వచ్చి ముందుగా తమ అను చరులను కలుసుకొని ఆఫీసు విషయాలను తెలుసుకుంటారు. కొద్దిసేపు ఆఫీసులో గడిపాక కింది స్థాయి అధికారుల గురించి ఆరా తీస్తారు. అందరినీ కలిసే ప్రయత్నం చేస్తారు. బాగా తెలిసిన వారిని నవ్వుతూ పలకరిస్తారు.

**పైరవీలు..**
బదిలీలు, పదోన్నతులు వంటి నోటిఫికేషన్లు విడుదలైతే చాలు కొందరు నాయకులు పైరవీల్లో మునిగి పోతారు. తాము కోరుకున్న ప్రాంతాలకు బదిలీ కావాలని కోరుతూ కొందరు ఉద్యోగులు నాయకుల వెంటపడతారు. ఈ నేపథ్యంలో తమ యూనియన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ కాకుండా యదాస్థానంలో ఉండేందుకు అధికా రులతో చర్చలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో లక్షల్లో చేతులు మారుతుంటాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో పెద్దాస్పత్రులే గాకుండా ఏరియా వైద్య విధాన పరిషత్ వంటి ఆస్పత్రులు, పీహెచ్‌సీలే గాకుండా తదితర ఆరోగ్య కేంద్రాల ఉద్యోగులు ఉంటారు. మొత్తం గా వైద్య ఆరోగ్య శాఖ కొందరు యూనియన్ నాయ కులకు బాగా కలిసొస్తుందనే ప్రచారం సర్వత్రా సాగుతోంది.

## మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**జనం పవర్, పటాన్‌చెరు, ఆగస్టు 26:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గాంధీ పార్క్ సమీపంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహి పాల్ రెడ్డి ప్రజలకు స్వయంగా మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ తప్పనిసరిగా పర్యావరణహిత మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.
చెరువులు, జలవనరులు కాలుష్యం కాకుండా కాపాడుకోవడానికి మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలని తెలిపారు. అలాగే నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నంసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 26:** పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అక్కడ ఉన్న వారు 100కు ఫోన్ చేశారు. వెంటనే పోలీసులు శవాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరిలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 26:** వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలంతా కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు కోరారు. జిల్లా ప్రజలకు ఆయన పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సకల కార్యాలకు ప్రథమ పూజ చేసేది.. పూజించేది విగ్నేశ్వరున్నే అని చెప్పారు. విగ్నేశ్వరుని అనుగ్రహముతో విఘ్నాలు తొలిగి అన్నింటా శుభం చేకూరాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్క ఇంటిలో మట్టి గణపతి ప్రతిమను పూజించాలన్నారు. మట్టి గణపతి పూజించడం ఎంతో శ్రేష్టమని మట్టి గణపతే మహా గణపతి అని చెప్పారు. వినాయక చవితికి మట్టిగణపతులనే పూజించండి. మనం ప్రకృతిని పేమిస్తే, గణపతి మనల్ని ప్రేమిస్తాడు. మనం ప్రకృతిని రక్షిస్తే గణపతి మనల్ని రక్షిస్తాడు. పర్యావరణాన్ని పరిరక్షణతో దేవున్ని పూజించాలని పిలుపునిచ్చారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో మండపాల వద్ద యువత, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని, విద్యుత్ లైన్ల విషయంలో, చెరువుల్లో నిమజ్జనం చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## యూరియా కోసం రైతుల ధర్నా

**జనం పవర్, కోహెడ, ఆగస్టు 26:** సరిపడా యూరియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు స్థానిక రైతు అగ్రో సేవా కేంద్రం ఎదుట రైతులు ధర్నా చేశారు. ఉదయం 6 గంటల నుంచి అగ్రోస్ రైతు సేవా కేంద్రం ముందు లైన్‌లో గంటలకొద్ది లైన్లలో నిలబడ్డారు. కొంత మందికి మాత్రమే యూరియా రావడంతో రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రైతే రాజు అని చెప్పే ఈ రాజ్యంలో రైతు కన్నీళ్లు పెట్టుకుంటే పట్టించుకునే వారే లేరన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు యూరియా బస్తాలు అందించడంలో విఫలమయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మంత్రి ఉండి కూడా రైతుల గోసా కనబడటం లేదా అని ప్రశ్నించారు. చివరికి తెందోళన విరమింపజేసి పోలీస్ సంరక్షణలో రైతులకు రెండు యూరియా బస్తాలు అందజేశారు.

## నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ



**జనం పవర్, నకిరేకల్, ఆగస్టు 26:** వినాయక చవితిని పురస్కరించుకొని నకిరేకల్ పట్టణానికి చెందిన బ్రహ్మదేవర వేణు మిల్ స్టోర్ సహకారంతో నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉచిత మట్టి విగ్రహాలను వంద మందికి పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కందాల పాపిరెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధులు డి. సూర్య కుమార్, బొల్లం కృష్ణమూర్తి, ఎర్ర శంభు లింగారెడ్డి, ఎల్లపు రెడ్డి యాదగిరి రెడ్డి, క్లబ్ కోశాధికారి అండెం వెంకన్న, శివా లయం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పల సంతోష్, పీఆర్‌ఓ వడ్లకొండ రామ సాయిలు, వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు తేలుకుంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీతకు సన్మానం



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 26:** సమాజ సేవలో డాక్టరేట్‌తో పాటు గిడుగు రామ్మూర్తి అవార్డు పొందిన ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్‌ను హైదరాబాదులో పలువురు సన్మానిస్తున్నారు. ఆదివారం విజయవాడలో గిడుగు రామ్మూర్తి అవార్డు పొందిన తర్వాత హైదరాబాద్ చేరుకున్న సతీష్ యాదవ్ కు పలు సంస్థల అధినేతలు వారి అనుచరులు ఘన సన్మానం చేయడం మొదలుపెట్టారు. మానవ సేవే మాధవసేవ సంస్థ అధినేత, తీన్మార్ మల్లన్న టీం వనపర్తి జిల్లా విజయ్ యాదవ్ తమ తమ అనుచరులతో సన్మానం చేసిన తర్వాత మాట్లాడుతూ సతీష్ యాదవ్‌కు డాక్టర్ రావడం మా వనపర్తి జిల్లా అదృష్టమని, దాంట్లో మళ్లీ గిడుగు రామ్మూర్తి అవార్డు కూడా రావడం మరో సంతోషమని తెలిపారు. సతీష్ యాదవ్ ఇలాగే ఒక్కొక్క మెట్టు పైకి ఎదగాలని కోరుకుంటు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవసేవే మాధవసేవ సంస్థ అధినేత గోకర్ల లక్ష్మీనారాయణ, తీన్మార్ మల్లన్న మహబూబ్‌నగర్ జిల్లా టీం అధ్యక్షుడు విజయ్ యాదవ్, మధు, కోటేశ్వర్, చరణ్, రెడ్డి బాబురావు, గేదెల మోహన్ రావు, మోహన్ రావు, సయ్యద్ బాషా, ఎండి మైబు, ఇస్మాయిల్, సేవియా నాయక్, మాధవ్, బోనాల శ్రీకాంత్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# అన్నదాతలకు యూరియా గోస



**జనంపవర్, పటాన్‌చెరు (జిన్నారం), ఆగస్టు 26:** జిన్నారం మున్సిపల్ కేంద్రంలో మంగళవారం ఉదయం యూరియా ఎరువుల కోసం రైతులు భారీగా తరలివచ్చారు. స్థానికంగా ఉన్న రెండు ఫర్టిలైజర్ షాపుల వద్ద పెద్ద ఎత్తున రైతులు పడిగాపులు కాసి క్యూల్లో నిలబడ్డారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఎరువుల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. సకాలంలో ఎరువులు అందకపోతే పంటలు నష్టపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకొని యూరియా సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వానాకాలం పంటలు నష్ట పోకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

## మట్టి విగ్రహాలనే పూజించాలి



**జనం పవర్, మాడుగులపల్లి, ఆగస్టు 26:** మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల సామాజిక కార్యకర్త చిట్యాల సందీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టర్ అఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు నీటిలో వేయడం ద్వారా నీరు మొత్తం కలుషితం అవుతుందన్నారు. అదే విదంగా నీటిలో ఉండే ఆక్వాటిక్ అనిమల్స్ అన్ని కుడా అంతరించే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి రంగు రంగుల విగ్రహం వద్దు- మట్టి విగ్రహం ముద్దు అనే నినాదంతో అందరు మట్టి విగ్రహాలు పుజించాలన్నారు. పర్యావరణం బాగుంటే ఆరోగ్యం బాగుంటుందని సందీప్ కుమార్ పేర్కొన్నారు.

# అబద్దాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 26:** అనేక అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బుధవారం పట్టణంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, సారయ్య, సోమిరెడ్డి, కొండం రవీందర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ ఎంపీగా రైతుల ఇబ్బందులు తీర్చాల్సిన రఘునందన్ రావు కాంగ్రెస్ పార్టీ షాడో అధికార ప్రతినిధి మాదిరి సీఎం రేవంత్ రెడ్డిని తిట్టకుండా చూస్తున్నారని విమర్శించారు. ఎరువుల అంశంపై మంత్రుల వ్యాఖ్యలు చూస్తే ప్రభుత్వం చేతులు ఎత్తిసేనట్టుగా ఉందన్నారు. గతంలో కేసీఆర్ హయాంలో ముందస్తు ప్రణాళికలు ఉండేవన్నారు. రైతులకు యూరియా సమస్య రాకుండా పదేళ్లు చూశారన్నారు. ఎండా కాలం లొనే సమీక్షలు జరిగేవని, బఫేర్ స్టాక్ అందుబాటులో ఉండేన్నారు. కేసీఆర్, మంత్రులు స్వయంగా పర్యవేక్షణ చేసేవారన్నారు.. ఢిల్లీలో రివ్యూ చేసి యూరియా తెచ్చేవారన్నారు. రైతుల పట్ల కేసీఆర్ కు ప్రేమ ఉంది కాబట్టి తాపత్రయ పడ్డారన్నారు. రైతులకు యూరియా ఇచ్చే పరిస్థితుల్లో కాంగ్రెస్ పభుత్వం లేదన్నారు. బీజేపీ ప్రతిపక్ష పార్టీ అన్న విషయం మర్చిపోయిందని ఏద్దేవా చేశారు.

## రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి

**- అంబేద్కర్ సంఘం నేత చెప్యాల ప్రకాష్**



**జనం పవర్, భీమదేవరపల్లి, ఆగస్టు 26:** కొన్ని నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత మూలంగా అన్నదాతలు అరిగోస పడుతున్నారని, వెంటనే యూరియా సరఫరా పెంచి రైతుల కష్టాలు తీర్చాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతే దేశానికి వెన్నుముక అని ప్రగల్బాలు పలుకుతాయని, దేశ జీడిపిలో వ్యవసాయ రంగానిదే సింహ బాగమని ఊకదంపుడు ఉపన్యాసాలు చేయడం తప్ప ఆచరణలో వారి సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రస్తుతం పంటలు కీలకమైన ఎదుగుదల దశలో ఉన్నాయని, ఇప్పుడు సరిపడా యూరియా పంటలకు అందించకపోతే దిగుబడిపై ప్రభావం చూపి రైతు తీవ్రంగా నష్టపోతాడని ఆందోళన వ్యక్తం చేశారు.

# వ్యాధులు నయం చేసే పాలజ్ కర్ర గణేశుడు

- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం..
- ఈ గణపతిని నిమజ్జనం చేయరు..
- స్థాపించి 78 సంవత్సరాలు

(జనం పవర్, భైంసా)

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న ఓ చిన్న మరాఠి గ్రామం పాలజ్. ఈ చిన్న మారుమూలపల్లి గత 20 ఏళ్లుగా లక్షలాది మంది నోళ్ళలో నానుతోంది. ఇక్కడ ప్రత్యేకత ఈ గ్రామానికి ప్రతి ఏటా లక్షల మందిని రప్పిస్తోంది. ఎక్కడా లేని విధంగా వినాయక నవరాత్రుల్లో ఈ గ్రామస్తులు కర్ర గణేష్‌ని ప్రతిష్ఠించి.. పూజించడమే ఈ పాలజ్ ప్రత్యేకత. ఇక్కడ కొలువుదీరే గణేశుడు కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా పేరొందాడు. పాలజ్‌లోని గ్రామ ఆలయ కమిటీ, గ్రామస్తులు కలిసి సమష్టిగా లక్షలాది భక్తులకు సౌకర్యాలను సమకూరుస్తుంటారు.

తెలంగాణ రాష్ట్ర సరిహద్దు మండలమైన కుబీర్ పక్కనే మహారాష్ట్రలోని బోకర్ తాలూకాలో పాలజ్ గ్రామం ఉంది. ఇక్కడ 1948 వ సంవత్సరంలో నిర్మల్‌కు చెందిన నకాసి కళాకారుడు పోలకొండ గుండాజి వర్మ కర్రతో మలిచిన వినాయకుడికి ప్రతిష్టాపన చేసి ప్రతియేటా పూజలు నిర్వహించారు. ప్రతి వినాయక చవితి సందర్భంగా కర్ర గణేశుడిని ప్రతిష్ఠించి చివరి రోజు పల్లకీలో ఊరేగించి సమీప వాగులో పూజలు జరిపి, నీళ్లను చల్లి నిమజ్జనోత్సవంగా భావిస్తారు. అనంతరం కర్ర విగ్రహాన్ని తిరిగి ఆలయంలోని బీరువాలో భద్రపరుస్తారు. కేవలం వినాయక నవరాత్రులప్పుడు మాత్రమే పాలజ్ కర్ర గణేశుడు దర్శనమిస్తాడు. మిగతా సమయంలో ఇక్కడి ఆలయంలో గణేశుడి ఫొటో మాత్రమే ఉంటుంది.

### పాలజ్ గ్రామమంతా మంచం పట్టిన వేళ..

స్వాతంత్ర్యానికి పూర్వం పాలజ్ గ్రామం కలరా, ప్లేగు వ్యాధులు ప్రబలి ఊరంతా మంచం పట్టింది. ఇదే సమయంలో వినాయక చవితి పండుగ వచ్చింది. ఊరి ప్రజలంతా గణేశుని నమ్ముకుందాం.. అని నిర్ణయించుకున్నారు. ఇందుకు ప్రత్యేకంగా కర్ర గణపతిని చేయించి ప్రతిష్ఠించాలని నిర్ణయించుకున్నారు. అందు కోసం నిర్మల్‌లో కొయ్య బొమ్మలు చేసే నకాసి కళాకారుడైన గుండాజి వర్మను రప్పించి సుందరమైన కర్ర గణేశుడి విగ్రహాన్ని చేయించారు. ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఊరంతా మొక్కితేనే వ్యాధులన్నీ దూరమయ్యాయని గ్రామ పెద్దలు చెబుతున్నారు. అలా అప్పటి నుంచి కర్ర గణేశుడిని మాత్రమే వినాయక ఉత్సవాల్లో కొలవడం ఆనవాయితీగా వస్తోంది. ఇక ఇక్కడ పూజలు చేసి, ముడుపు కడితే కోరుకున్న పని జరిగి తీరుతుందన్న నమ్మకం ఉంది. ముందుగా ఈ ఊరికి చెందిన ఆడపడుచుల ద్వారా కర్ర గణేశుడి మహిమ ఇతర గ్రామాలను తెలిసింది. అలా ఊరూరా పాలజ్ ప్రత్యేకత విస్తరిస్తూ ఇప్పుడు ఏకంగా ఉత్తర తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర అంతా వ్యాపించింది.



### సుందర రూపుడిగా..

కర్రతో చేసిందైనా.. నకాసి కళాకారుడు గుండాజి వర్మ చేతుల్లో సుందరంగా రూపుదిద్దుకున్నాడు ఇక్కడి లంబోదరుడు. అసలు కర్రతో ఇంత అందంగా విగ్రహాన్ని మలచవచ్చా.. అనేంత నునుపుగా గణపయ్యను తీర్చిదిద్దాడు. సింహాసనంపై ఆసీనుడైన గణపయ్యకు పెద్ద చెవులు ఉంటాయి. నాలుగు చేతుల వాడిగా.. ఒక చేతిలో గండ్రగొడ్డలి, మరో చేతిలో త్రిశూలం, ఇంకో చేతిలో లడ్డుతో, కుడి చేతితో ఆశీర్వదిస్తున్నాడు.

### భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు..

ఉదయం 4 గంటల నుండి 6 గంటల వరకు కాకడ హారతి, ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు భాగవత కథ, సాయంత్రం ఐదు గంటల నుండి 10 గంటల వరకు హరి కీర్తన, ఇక్కడికి వచ్చే భక్తుల కోసం రాత్రి 10 గంటల నుండి రాత్రి ఒంటి గంట వరకు తెలుగు, హిందీ, మరాఠీ, ప్రసిద్ధి చెందిన గాయకులచే, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కళాకారులచే అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. భక్తులు ఉండడానికి అన్ని రకాల సౌకర్యాలు కూడా కల్పిస్తారు.

### గ్రామస్తులంతా కలిసికట్టుగా..

భారీ సంఖ్యలో తరలివచ్చి భక్తులతో పాలజ్ ఆలయానికి ఆదాయం లక్షల్లో వస్తుంది. పాలజ్ గ్రామస్తులు కలిసికట్టుగా కర్ర గణేశుడి సేవలో పాల్గొంటారు. ప్రతి ఏడాది ఆదాయాలు పెరుగుతూనే వస్తున్నాయి. గత 15 సంవత్సరాల కింద సాదా సీదాగా ఉండే పాలజ్ ఆలయం ఇప్పుడు సరికొత్త హంగులతో ఇరుగు పొరుగు జిల్లాల వారిని ఆకట్టుకుంటుంది. 2004 ప్రాంతంలో ఆలయ కమిటీ, గ్రామస్తులు చందాలు పోగు చేసి సేకరించిన మొత్తానికి మరో రెండు లక్షల రూపాయలు కలిపి ఆలయ నిర్మాణం ప్రారంభించారు. అందంగా నిర్మించిన ఆలయం పూర్తయిన తర్వాత భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గ్రామస్తులే కోటి రూపాయలతో అన్నదాన సత్రాలు, స్నానపు గదులు, మరుగు దొడ్లు నిర్మించారు. చుట్టుపక్కల గ్రామాలకు ఇక్కడి నుంచి శుద్ధ నీరు అందిస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలోనే సీసీ రోడ్లు వేశారు. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలను అమర్చారు.

### పాలజ్ గ్రామానికి వెళ్లడం ఎలా...

హైదరాబాద్ నుంచి వచ్చేవారు నిజామాబాద్ బాసరల మీదుగా భైంసా చేరుకోవాలి. నిర్మల్ మీదుగా వచ్చే వాళ్లు కూడా భైంసా మీదుగా పాలజ్‌కు వెళ్లాల్సి ఉంటుంది. భైంసా పట్టణం నుండి 23 కిలోమీటర్ల దూరంలో పాలజ్ గ్రామం ఉంటుంది. భైంసా నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చే వాహనాల కోసం ఆలయ ప్రాంగణంలో గ్రామ కమిటీ పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేసింది.

### భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం..

**- ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘువీర్ బందెల్ వార్**

పాలజ్‌లో భక్తుల సౌకర్యానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. తాగునీరు, తీర్థప్రసాదాలు అందిస్తున్నాం. వచ్చే భక్తుల వాహనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పార్కింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. భక్తులకు అల్పాహారాన్ని, భోజనాలను అందిస్తున్నాం.

## హెచ్ఎంఎస్ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



**జనం పవర్, జైపూర్, ఆగస్టు 25:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం -1ఏ, ఇందారం ఓసీపీ నందు ఈ నెల 30, 31వ తేదీలలో శ్రీరాంపూర్‌లో నిర్వహించే హెచ్ఎంఎస్ 26వ ద్వైపాక్షిక మహాసభల పోస్టర్లను హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి పరిరక్షణ, వేలం పాటతో సంబంధం లేకుండా నూతన భూగర్భ గనుల సాధన, అలవెన్స్‌లపై ఇన్కమ్ టాక్స్ మినహాయింపు, సంస్థలో అవినీతి నిర్మూలన, కార్మికుల ఆత్మగౌరవం, మరిన్ని ముఖ్యమైన హక్కుల సాధన కోసం మహాసభలలో తీర్మానం చేసి పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తారని తెలిపారు. ఈ మహాసభలకు యావత్ సింగరేణి కార్మిక వర్గం మహిళా కార్మిక వర్గం, కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి పొన్నగంటి అశోక్, పిట్ కార్యదర్శులు ఎర్రంశెట్టి సాయి కుమార్, గుండ్ల లక్ష్మణ్ కుమార్, కొల్లూరు శ్రీనివాస్, కొట్టే సురేష్, వేముల వంశీ, రాధాకృష్ణ, రెహమాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాసర ఆర్జీయూకేటీ పీఆర్‌వోగా డాక్టర్ బాలకృష్ణ



**జనం పవర్, భైంసా, ఆగస్టు 26:** బాసర మండల కేంద్రంలో ఉన్న ఆర్జీయూకేటి కళాశాల నూతన పీఆర్‌వో (పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్)గా డాక్టర్ బాలకృష్ణ నియమితులైనట్లు క్యాంపస్ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. ఇంతకుముందు ఈ పదవిలో ఉన్న డాక్టర్ విజయకుమార్ స్థానంలో డాక్టర్ బాలకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ బాలకృష్ణకు వీసీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇకపై కళాశాలలో జరిగే కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేస్తారని క్యాంపస్ వీసీ తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**జనం పవర్, భైంసా, ఆగస్టు 26:** సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే రామారావు పటేల్ పంపిణీ చేశారు. మంగళవారం భైంసాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 103 మంది లబ్ధిదారులకు రూ.23 లక్షల 63 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యం బారిన పడితే ప్రభుత్వం తరఫున సహాయం అందించడమే ముఖ్యమంత్రి సహాయనిధి ధ్యేయమన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదని ప్రజలు నేరుగా వచ్చి తమ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వేలాది చెక్కులను ఈ 20 నెలల కాలంలో అందించడం జరిగిందన్నారు. సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు రావుల రాము, శ్రీరామ్ సుష్మారెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

### లింగ గ్రామ సమస్యలు పరిష్కరించండి..

భైంసా డివిజన్ పరిధిలోని లింగ గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను గ్రామస్తులు కోరారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రామారావు పటేల్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అభివృద్ధి చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు విఠల్ పటేల్, కదం అర్జున్, యోగేష్, అఖిలేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 26:** శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి మంగళవారం విద్యార్థిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ వినాయక ఉత్సవాలనేవి భారతదేశానికి స్వతంత్రానికి పూర్వం ఘనంగా నిర్వహించారని అప్పటి నుండి భారతదేశంలో అన్ని రాష్ట్రాలలో వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా వినాయకుని 21 పత్రులతో పూజించడం వల్ల ఇండ్లలోని క్రిమి కీటకాలు నశిస్తాయని, శ్వాసకోశ వ్యాధులు ఏమైనా ఉన్నట్లయితే నయమైతాయని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సునీత, డాక్టర్ బట్టు వెంకన్న, డాక్టర్ వెంకట్, డాక్టర్ రజిని, డాక్టర్ మధు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివ జ్యోతి, అరుణ, శ్రీలత, వెంకటరమణ, సరస్వతి, సైదులు శశికళ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలు పంపిణీ

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 26:** సింగరేణి కార్పొరేట్ ఏరియా సింగరేణి సంస్థ వైఫ్స్ అసోసియేషన్ (సేవా) ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎండి క్వార్టర్స్ మెయిన్ హాస్పిటల్ ఏరియా నందు జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం డిజిఎం(పర్సనల్) కేసా నారాయణరావు దాదాపు 300 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్) కేసా నారాయణరావు, కమ్యూనికేషన్ ఆఫీసర్ కే.ఉదయ్ కుమార్, వెల్ఫేర్ పిఏ కే.వర ప్రసాద్, సేవా కో-ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, సేవ కో-ఆర్డినేటర్స్ మునీల, సుజాత, స్వర్ణలత, మీనా కుమారి, రమా దేవి, పద్మావతి, ఇందుమతి, సేవా సభ్యులు, శిక్షకులు పాల్గొన్నారు.




## సమగ్ర శిక్షణ ద్వారా ఉచితంగా ఉపకరణాలు అందజేత

### ప్రత్యేక ఉపాధ్యాయుడు అవదూత్ నరేష్



**జనం పవర్, భైంసా, ఆగస్టు 26:** భైంసా డివిజన్ పరిధిలోని భవిత విలీన విద్య వనరుల కేంద్రంలో నిర్మల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆలింకో వారి సహకారంతో పుట్టిన పిల్లల నుండి 18 సంవత్సరాల వరకు ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు సమగ్ర శిక్షణ ద్వారా ఉచితంగా ఉపకరణాలను అందజేసే శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రత్యేక ఉపాధ్యాయుడు అవదూత్ నరేష్ తెలిపారు. శారీరక దివ్యాంగులు మూడు చక్రాల సైకిల్, వీల్ చైర్, క్యాలిపర్స్, కృత్రిమ అవయ వాలు, వాకింగ్ ఫ్రేమ్, రోలేటర్, చేతి కాళ్ల పట్టిలు, సీపీ చైర్ అందజేయనున్నట్లు తెలిపారు. వినికిడి లోపం శరీర రకం రెండు రకాలు ఎస్.త్రాడు మితమైనది, వి.త్రాడు మితమైనది, చెవి వెనుక రెండు రకాలు మితమైన, బ్యాటరీతో బలమైనది. దృష్టిలోపం ఉన్నవారికి కంటి అద్దాలు, భూత అద్దాలు, పెద్ద ప్రింట్ పుస్తకాలు, బ్రెయిలీ పుస్తకాలు, బ్రెయిలీ సియేట్ మరియు స్టైలిష్, టైలర్ ఫ్రేమ్, అందుల చేతి కర్ర, టేప్ రికార్డర్, బ్రెయిలీ టెస్ట్ బుక్, అబాకాస్, యూనివర్సల్ బ్రెయిలీకిట్. మానసిక దివ్యాంగులకు ఎమ్మెస్ ఐడి కిట, వైకల్యం సంబంధిత ఉపకరణాలను అందజేస్తామన్నారు. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు మరింత సమాచారం కోసం భవిత విలీన విద్య వనరుల కేంద్రం భైంసాలో సంప్రదించాలని, ప్రత్యేక ఉపాధ్యాయుడు అవదూత్ నరేష్ 99083 16257, కె.సునీల్ 9866146502ను సంప్రదించాలని తెలిపారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ



**జనం పవర్, బెల్లంపల్లి, ఆగస్టు 26:** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కోర్టు పరిధిలో న్యాయవాది తన్నీరు శ్రీకాంత్ పై జరిగిన దాడికి నిరసనగా బెల్లంపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ వృత్తి పరంగా విధులు నిర్వహిస్తున్న న్యాయవాదిపై దాడి చేయడం ఆమానుషమని, ఈ దాడిని బెల్లంపల్లి బార్ అసోసియేషన్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దాడి చేసినవారిని వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే న్యాయవాద రక్షణ చట్టం అమలు చేయాలని కోరారు.

## జైపూర్ గురుకులం, కేజీబీవీ తనిఖీ

**జనం పవర్, జైపూర్, ఆగస్టు 26:** మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం జైపూర్ కేంద్రంలోని గురుకుల పాఠశాలను కేజీబీవీని ఎంపీడీఓ జి. సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపు రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనశాలను, నీటి ట్యాపులను తనిఖీ చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, ఆహారం వండే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచా లని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, కేజీబీవీస్ ఓ ఫణిబాల, పంచాయతి కార్యదర్శి బి. ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

### కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్



**జనం పవర్, బెల్లంపల్లి, ఆగస్టు 26:** బెల్లంపల్లి అంబేద్కర్ (కాంటా) చౌరస్తాలో శ్రీ బుగ్గ రాజ రాజేశ్వరస్వామి దేవాలయం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి గణేష్ విగ్రహ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్ పాల్గొని స్థానిక నాయకులతో కలిసి మట్టి వినాయక విగ్రహాలను పంపించేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ ప్రజలు గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మట్టి విగ్రహాలనే ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, నియోజక వర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి, దూడం మహేష్, ముక్తా రాజన్న, బామండ్లపల్లి భరత్, రాజేందర్, ఈఓ బాపురెడ్డి, అర్చకులు సతీష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లకు కమీషన్ ఇవ్వాలి

**జనం పవర్, కోహెడ, ఆగస్టు 26:** రేషన్ డీలర్లకు రావాల్సిన ఐదు మాసాల కమిషన్ ప్రభుత్వం వెంటనే అందించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్స్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్తర్వుల కనుగుణంగా డీలర్లకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కమిషన్ రావాల్సి ఉందన్నారు. కమిషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీలర్లకు ఇచ్చే కమిషన్ వేర్వేరుగా కాకుండా పాత పద్ధతి ప్రకారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోహెడ మండల రేషన్ డీలర్స్ పాల్గొన్నారు.

# చైన్ స్నాచర్ అరెస్టు

- 237 గ్రాముల బంగారు ఆభరణాలు, పదివేల నగదు, సెల్ ఫోన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సన్ ప్రీత్ సింగ్



**జనం పవర్, హనుమకొండ, ఆగస్టు 26:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్మానుష్య ప్రదేశాల్లో రోడ్లపై ఒంటరిగా వెళ్తున్న మహిళలే లక్ష్యంగా వారి మెడల్లో చైన్ స్నాచింగ్‌లతో పాటు, ద్విచక్రవాహన చోరీలకు పాల్పడుతున్న నిందితున్ని కేయూసీ, సీపీఎస్ పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేసారు. అరెస్టు చేసిన నిందితుడి నుంచి సూమారు 23లక్షల 50వేల రూపాయల విలువ గల 237 గ్రాముల బంగారు పుస్తెల తాళ్లు, గొలుసులు, మూడు ద్విచక్ర వాహనాలు, పదివేల రూపాయల నగదు, సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ అరెస్టుకు సంబందించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడించారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం, దామెర గ్రామానికి చెందిన మంతుర్తి హరీష్(29), ప్రస్తుతం హన్మకొండ రెడ్డి కాలనీలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్న నిందితుడు డిగ్రీ వరకు చదువు పూర్తి చేసి ఓ సిమెంట్ కంపెనీలో క్వాలిటీ టెక్నిషన్‌గా హైదరాబాద్‌లో పనిచేసేవాడు. ఇదే క్రమములో మొదటగా ఈ ఏడాది ఇదే సిమెంట్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న సహొూఉద్యోగి ఇంటిలో బంగారు గోలుసు చోరీకి పాల్పడి దానిని స్థానిక మణిప్పురం గోల్డ్ లోన్ కంపెనీలో తాకట్టు పెట్టగా వచ్చిన డబ్బుతో నిందితుడు జల్సాలు చేసినాడు. ఈ సంఘటలో నిందితుడుని స్థానిక నెరెడ్‌మెట్ పోలీసులు ఈ ఏడాది అరెస్టు చేసిన జైలుకు తరలించారు. బెయిల్‌పై విడుదలైన నిందితుడిలో ఏలాంటి మార్పు రాకపోగా తన జల్సాలకు అవసరమైన డబ్బు తన వద్ద లేకపోవడంతో నిర్మానుష్య ప్రదేశాల్లో ఒంటరిగా రోడ్డుపై వెళ్తున్న మహిళల మెడలో చ్కెన్ స్నాచింగ్‌లకు పాల్పడి వాటిని అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేద్దామనుకున్న నిందితుడు ముందుగా చ్కెన్ స్నాచింగ్ చేసేందుకు ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి వెళ్ళి చ్కెన్ స్నాచింగ్‌లకు పాల్పడేవాడు. ఇదే రీతిలో నిందితుడు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం పది చ్కెన్ స్నాచింగ్‌లు, మూడు ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడ్డాడు. ఇందులో కెయూసి పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, రాయపర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, అలాగే సుబేదారి, కాజీపేట, హసన్‌పర్తి, కమలాపూర్, కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకటి చోప్పున చ్కెన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడగా, హన్మకొండ, హసన్ పర్తి, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిందితుడు మూడు ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడ్డారు.

ఈ వరుస చైన్ స్నాచింగ్ చోరీలపై అప్రమత్తమైన పోలీసులు క్రైమ్స్, హన్మకొండ ఏసిపిల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకొని నిందితుడుని గుర్తించిన పోలీసులు పక్కా సమచారంతో ఈ రోజు ఉదయం పోలీసులు యాదవ్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద కెయూసి, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా వాహణ తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో చోరీ చేసిన బంగారు గొలుసులను విక్రయించేందుకు అనుమానస్పదంగా చోరీ చేసిన ద్విచక్ర వాహనంపై వస్తున్న నిందితుడుని రోడ్డుపై తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి తప్పించుకొని పారిపోతున్న నిందితుడుని పోలీసులు పట్టుకొని తనిఖీ చేయగా నిందితుడి వద్ద బంగారు గొలుసును గుర్తించిన పోలీసులు. నిందితుడిని పోలీసులు అదుపులో తీసుకొని విచారించగా నిందితుడు పాల్పడిన చ్కెన్ స్నాచింగ్, ద్విచక్ర వాహన చోరీలను అంగీకరించాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో అతను నివాసం ఉంటున్న అద్దె ఇంటి నుండి పోలీసులు మిగితా చోరీ సోత్తును స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడుని పట్టుకోవడంలో ప్రతిభ కబరిచిన క్రైమ్స్ డీసీసీ గుణశేకర్, క్రైమ్స్ ఏసీపీ సదయ్య, హన్మకొండ ఏసీపీ నర్సింహరావు, కెయూసి, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్లు రవి కుమార్, రాఘవేందర్, ఏఏఓ సల్మాన్ పాషా, సిసిఎస్ ఎస్సైలు రాజ్‌కుమార్, శివకుమార్, హెడ్ కానిస్టేబుళ్ళు అంజయ్య, జంపయ్య, కానిస్టేబుళ్ళు మధుకర్, చంద్రశేఖర్, రాములు, నగేష్‌లతో కెయూసి పోలీస్ స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## మట్టి విగ్రహాలను నెలకొల్పాలి

- అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 26:** పర్యావరణ హితం కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కాకుండా మట్టి విగ్రహాలను మాత్రమే నెలకొల్పాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ఖీమ్యా నాయక్ సూచించారు. వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని మంగళవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో వినాయక మట్టి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్యతో కలిసి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ లో అమ్ముతున్న వినాయక విగ్రహాలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్, పర్యావరణానికి హాని కలిగించే రంగులతో తయారు చేసి అమ్ము తున్నారని, వాటిని పూజ అనంతరం నీటిలో నిమజ్జనం చేయడంతో నీరు కాలుష్యమై పర్యావరణానికి హాని కలిగిస్తుందన్నారు. రంగులు పర్యావరణం,నీరు కాలుష్యం కావడమే కాకుండా చాలా రోజుల వరకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహం నీటిలో త్వరగా కరిగిపోకుండా ఉంటుందని తెలిపారు. అందువల్ల మట్టి విగ్రహాలను మాత్రమే నెలకొల్పి పూజించడం వల్ల పర్యావరణాన్ని కాపాడినవారవుతారని తెలియజేశారు. బీసీ సంక్షేమ శాఖ, కాలుష్య నియంత్రణ సంస్థ ద్వారా వనపర్తి జిల్లా ప్రజలకు 2000 మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.అనంతరం పర్యావరణ పరిరక్షణ నిమిత్తం కాలుష్య నియంత్రణ మండలి ద్వారా రూపొందించిన ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, జిల్లా అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి ఎఈఎస్ సురేష్, ఎఒ భాను ప్రకాష్, బీసీ సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ప్రభాకర్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ పాయిజన్ తో అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 26:** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలోని శేట్లూర్ గ్రామం ప్రాథమిక పాఠశాలలో సోమవారం మధ్యాహ్నా భోజన పథకంలో జరిగిన ఫుడ్ పాయిజన్ పిల్లలను మాజీ ఎమ్మెల్యే అరుణా తార పరామర్శించారు. అదేవిధంగా బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శెట్లుర్ గ్రామ విద్యార్థులు మధ్యాహ్నం ఆహార పథకంలో అస్వస్థకు 21 మంది విద్యార్థులు గురి కావడంతో వారిని మాజీ ఎమ్మెల్యే అరుణా తార పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని డాక్టర్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురి కావడం బాధకరమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు శెట్టిపల్లి విష్ణు, పెద్ద దేవడ మాజీ సర్పంచ్ మల్లి కార్జున్ దేశయి, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లు దేశయి, బీజేపీ ఉపాధ్యక్షులు హడికే వార్ రాజు, బూత్ అధ్యక్షులు రాజు పటేల్, సీనియర్ నాయకులు మొగులు గొండ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాల పంపిణీ



**జనం పవర్, నకిరేకల్ ఆగస్టు 26:** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ మంగళవారం మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల నిరసన



**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 26:** కూకట్‌పల్లిలో లాయర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ బిచ్కుంద న్యాయవాదులు మంగళవారం నిరసన తెలిపారు. కూకట్‌పల్లి కోర్టు పరిధిలోని న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై ప్రతిపక్ష పార్టీ వ్యక్తులు కట్టెలు తదితర వస్తువులతో అన్యాయంగా, దౌర్జన్యంగా చేసిన దాడిని ఖండిస్తూ బిచ్కుంద న్యాయవాదులు తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ.ప్రకాష్, జనరల్ సెక్రటరీ ఈ. శివాజీ, ఉప అద్యక్షులు రాజేష్ డెస్మక్,న్యాయవాదులు యం. లక్ష్మణ్ రావు, టీ.విఠల్, జి. మల్లేశ్వర్, ఏ.విఠల్ రావు, శ్రీనివాస్, షేక్ మొహమ్మద్, పి.రవి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ స్పృహను పెంపొందించిన ఎకో గణేశ విగ్రహం తయారీ



**జనం పవర్, పటాన్‌చెరు ,ఆగస్టు 26:** పర్యావరణహిత వినాయక చవితి సందేశాన్ని వ్యాప్తి చేస్తూ గీతంలోని విమెన్ లీడర్స్ ఫోరం (డబ్ల్యూఎల్ఎఫ్) మంగళవారం ప్రత్యేకంగా ఎకో-గణేశ విగ్రహ తయారీ కార్యక్రమం నిర్వహించింది. కృత్రిమ రంగులు, రసాయనాలు లేకుండా సహజ పదార్థాలతో మట్టి గణపతులను తయారు చేసి పర్యావరణ స్పృహను చాటుకుంది. విద్యార్థులకు అవసరమైన బంకమట్టి, విత్తనాలను అందజేశారు. పూజ అనంతరం ఈ విగ్రహాలను తోటల్లో లేదా ఇంటి ప్రాంగణంలోనే నిమజ్జనం చేసేలా రూపొందించారు. ఈ వినూత్న పద్ధతి కాలుష్యాన్ని తగ్గించడమే కాక, పచ్చదనాన్ని పెంపొందించే అవకాశం కల్పిస్తుంది.

రుద్రారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సంస్కృతి, అన్వేషణ విభాగాల ఆధ్వర్యంలో కూడా పర్యావరణహిత గణపతి విగ్రహాల తయారీ కార్యక్రమం నిర్వ హించారు. రెండు కార్యక్రమాలలోనూ వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, హరిత సందేశాన్ని మరింతగా వ్యాప్తి చేశారు. ఈ సందేశాత్మక కార్యక్రమాలను నిర్వహించిన విద్యార్థి బృందాల అధ్యక్షులు, సభ్యు లను గీతం ఉన్నతాధికారులు అభినందించారు.

## కేంద్రం నిర్లక్ష్యంతోనే యూరియా కొరత



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 26:** కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల యూరియా కొరత ఏర్పడిందని కాంగ్రెస్ చిన్నకోడూరు మండల అధ్యక్షులు మీసం మహేందర్ ఆరోపించారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశానుసరం అలిపూర్, రెవెన్యూ, అల్లీపూర్ రైతు వేదిక క్లస్టర్ పరిధిలో ఉన్న కిష్టాపూర్, చెల్కలపల్లి, కాసారం పల్లీ, కొత్తపల్లి, రంగయ్య పల్లీ, ఎల్లయ్య పల్లీ, కమ్మర్లపల్లి, మైలారం, బిక్క బండ, కొండేంగలకుంట గామాల రైతులకు అల్లిపూర్ రైతు వేదికలో టోకెన్ ఇచ్చారన్నారు. ఓర్చుకోలేని హరీష్ రావ్ టోకెన్స్ ఇచ్చిన అధికారిని సస్పెండ్ చేయాలనీ అనడం సిగ్గు చెటన్నారు. హరీష్ రావ్ నేరుగా రైతులకు యూరియా అందకుండా అపుతూ రైతులను ఒక దగ్గర గుమిగుడే విధంగా చేసి రెచ్చగొట్టడం తమ సిగ్గుమాలిన తనానికి నిదర్శనమన్నారు, రైతులపై చిత్త శుద్ధి ఉంటే అల్లీపూర్ సొసైటీలో అవినీతికి పాల్పడి రైతులను ముంచిన నీ అనుచరుడు అయినటువంటి చైర్మన్‌ను వదవి నుండి తొలగించి క్రిమినల్ కేసు పెట్టించు సొమ్ము రికవరీ చేసి రైతులపై చిత్త శుద్ధి చాటుకోవాలని సవల్ విసిరారు. మండల ఉపాధ్యక్షులు సందబోయిన పరశురాం, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాకాల భూపతి, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఉడుత ప్రశాంత్, మాజీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శంకర్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు జయంత్, నాయకులు అనిల్, మోహన్, తిరుపతి రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ**



జనం పవర్, వనపర్తి, ఆగష్టు 26: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు స్థానిక సమస్యలపై మండలాలు, మున్సిపల్ కేంద్రాల్లో ఆందోళన, ధర్నా కార్యక్రమంలో భాగంగా పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవోకు మెమొరండం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ మాట్లాడుతూ వనపర్తి పట్టణంలో రోడ్డు విస్తరణ సందర్భంగా ఇల్లు కోల్పోయిన బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు ప్రభుత్వ సహాయం, డబు ల్ బెడ్ రూమ్ ఇల్లు అందలేదన్నారు. వారికి వెంటనే న్యాయం చేకూర్చాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం వృద్ధాప్య పెన్షన్లు ఆరు వేలు. దివ్యాంగుల పెన్షన్ ఆరు వేలు చేయాలని, భర్త చనిపోయిన వితంతువులకు ఏ షంతు లేకుండా వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని, యూత్ డిక్లరేషన్ ప్రకారం నిరుద్యోగ భృతి 4016/- వెంటనే చెల్లించాలన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఏ వన్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న వనపర్తిలో తాగునీరు ఏ క్షణం ఏ రోజు ఏ సమయానికి వస్తుందో తెలియక పట్టణ ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి 33 వార్డులలో సమయ సూచన పాటించి మంచినీటి సరఫరా జరపాలని అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు ప్రారంభించాలని లేనిపక్షంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వనపర్తి మున్సిపల్ లో ఒక్క వార్డు కూడా గెలువ నివ్వమని ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి గోరపరాభావం తప్పదని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్ది రాజు, శ్రీనివాస్ గౌడ్, కల్పన, మాజీ ఉపాధ్యక్షులు సీతారాములు,రాయన్న వెంకటేశ్వర్లు, విష్ణు వర్ధన్ రెడ్డి, సుమిత్రమ్మ, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యవారి ప్రభాకర్ రెడ్డి,సబ్బిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఓబీసీ మోర్చా శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు బాబు రావు, మురార్జన్ నాయక్, జిల్లా కార్యదర్శి కాటమోని కృష్ణ గౌడ్, రోజ, జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి, జిల్లా కార్యాలయ కార్యదర్శి ఆగుపోగు కుమార్, జిల్లా మీడియా ఇంచార్జ్ గజరాజుల తిరుమలేష్, జిల్లా ఐటీ ఇన్చార్జ్ ఆంజనేయులు,పట్టణ అధ్యక్షులు. రాజశేఖర్ గౌడ్,పట్టణ ప్రధాన కార్యదర్శి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నెత్తి చూడరు 'కంటి' ఆస్పత్రిని

## ప్రాంతీయ ఆస్పత్రిపై చిన్నచూపు




**జనం పవర్, వరంగల్ బ్యూరో:** ఆస్పత్రులు ఆకస్మిక తనిఖీలు చేపట్టినా కంటి ఆస్పత్రిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. నిన్నటి వరకు వరంగల్ నగరంలోని సర్కార్ ఆస్పత్రులను తనిఖీ చేసినా ఉత్తర తెలంగాణకు ఏకైక దిక్కుగా పిలువ బడుతున్న వరంగల్ లోని ప్రభుత్వ ప్రాంతీయ వంద పడకల నేత్ర వైద్య శాలను సందర్శించిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో కంటి ఆస్పత్రి ఎవరి ఆదరణ లేక ఓ మూలన పడి ఉంటోంది. ఎంజీఎం ఆస్పత్రి, హన్మకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, వరంగల్ లోని చందా కాంతయ్య ప్రభుత్వ సహాయక ఆస్పత్రులను తరచూ తనిఖీ చేయడం, సందర్శించడం వంటి చర్యలతో హంగామా చేస్తుంటారు. అంతేకాకుండా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు ఇక్కడి నుంచే పోతూ వస్తుంటారు. అయినా నేత్ర వైద్య శాల ఎవ్వరికీ కనిపించదు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నా, కాలం చెల్లిన విలువైన మందులను గుట్టుగా తగులబెట్టినా, ఆస్పత్రిలో మందుల కొరత ఉన్నా, రోగులకు సరైన ఆహారం పెట్టకపోయినా అంతేకాదు అధికారుల పర్యవేక్షణ లేకపోయినా.. ఇలా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా కన్నెత్తి కూడా చూడరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్గొండ, జిల్లాలతోపాటు ఛత్తీస్ ఘడ్, ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాల నుంచి కూడా రోగులు వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల కు వస్తుంటారు. నిష్ణాతులైన వైద్యులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు ఆస్పత్రిలో నిత్యం వందల మంది రోగులతో ఓపి వైద్య విభాగాలు రద్దీగా ఉంటాయి. విశాలమైన ప్రాంగణంలో ఆస్పత్రిని నిర్మించారు. చుట్టూ పచ్చని చెట్లతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

**తగులబెట్టిన మందులు..**

ఆస్పత్రిలో విలువైన మందులు తగలబెట్టడం గతంలో చర్చనీయాంశంగా మారింది. బై అండ్ సప్లయ్ కింద కంపెనీల నుంచి ఇబ్బడిముబ్బడిగా కొనుగోలు చేసిన మందులను గుట్టుగా నిల్వచేయడం తో వాటి గడువు దగ్గర పడటంతో ఆ మందుల పై ఎవరి దృష్టి పడకుండా గుట్టుగా తగులబెట్టారనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. ఈ సంఘటనపై విచారణ కూడా తూతుమంత్రంగా సాగినట్లు విమర్శలు వెల్లువెత్తాయి.

**నామమాత్రంగా పర్యవేక్షణ..**

వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా ఉంటుందనే విమర్శలు వస్తున్నాయి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందినా అందకపోయినా పట్టించుకునే వరుండరని పలు వురు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు రోగులకు కంటి పరీ క్షలు నిర్వహించే డాక్టర్లు (విద్యార్థులు) అటు తరువాత కనిపించరని బాధిత రోగులు కొందరు ఆందోళన వ్యక్తం చేశారు.

**అరకొర సిబ్బంది సేవలు..**

ఆస్పత్రిలో అరకొర సిబ్బంది రోగులకు వైద్య సేవలం దిస్తున్నారు. చాలా మంది వైద్యులు, కొందరు కింది స్థాయి ఉద్యోగులు పదవీ విరమణ చేయడం, కొందరు చనిపోవడం అంతేకాకుండా బదిలీపై వెళ్లడం వంటి పలు కారణాలతో కంటి ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఏర్పడిందని కొందరు సిబ్బంది పేర్కొన్నారు.

**ఆరోగ్య మంత్రి ఇటు చూడరూ....?**

అనేక సమస్యలతో గుట్టుగా నెట్టుకొస్తున్న వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తనిఖీ చేసి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు ఈ ఆస్పత్రిని ఎవరూ పట్టించుకున్న సందర్భాలు లేవనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఆరోగ్య శాఖ మంత్రి స్పందిస్తారని పలువురు ఆశిస్తున్నారు.

# పేపర్ పరిశ్రమ నుంచి బూడిద వర్షం..

**- మంబాపూర్ రైతుల పంటలు నాశనం - ఆందోళనలో అన్నదాతలు**





**జనం పవర్, పటాన్‌చెరు (గుమ్మడిదల), ఆగస్టు 26:** గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామంలో తిరుమల పేపర్ పరిశ్రమ నుంచి వస్తున్న నల్లటి బూడిద వర్షం కారణంగా గ్రామ ప్రజలు,రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న ధూళి, పొగల వల్ల పక్కనే ఉన్న పంట పొలాలు నాశనం అవుతుండగా పశువులు కూడా అనారోగ్యానికి గురవుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా పరిశ్రమ నుంచి వచ్చే రసాయన బూడిద వర్షపు నీటితో కలసి పంట పొలాల్లోకి ప్రవహిస్తోంది. దీంతో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు. పటేల్ చెరువులోకి కూడా బూడిద కలిసిపోవడం వల్ల చెరువు నీటిని తాగే పశువులు వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నాయి. గ్రామస్తులు మాట్లాడుతూ రాత్రింబవలు పరిశ్రమ నుంచి వచ్చే బూడిద కారణంగా ఇంటి బయట ఉన్న నీళ్ల డ్రమ్ములు, బట్టలు నల్లగా మారుతున్నాయి. పిల్లలు, వృద్ధులు దగ్గు, దమ్ము, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు, పిసిబి (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) వారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పరిశ్రమపై తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## బీఆర్ఎస్ నాయకుల వినూత్న నిరసన



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 26:** రైతులకు సకాలంలో ఎరువు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. మంగళ వారం వన పర్తిలో బీఆర్ఎస్ నాయకులు దున్నపోతు ద్వారా ప్రభుత్వానికి విన్నవించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బిజేపీల దొం గాటలో రాష్ట్ర రైతాంగం నడ్డి విడుస్తున్నారు. సకాలంలో ఎరువులు ఇవ్వక ఇచ్చామని ఒకడు, ఇవ్వలేదని ఒకడు డ్రామా లలాడుతూ బ్లాక్ మార్కెట్లో ఎరువులు అమ్ము కుంటున్నారు. దీనిపై వనపర్తి జిల్లా కేంద్రంలో మంగళవారం ఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసనలు చేస్తే పోలీసులు అరెస్టులు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజా స్వామ్యం లేకుండా పోయిందన్నారు. అధికారులు పోలీసులు అధికార పార్టీకి బానిస లుగా మారారన్నారు. న్యాయం అడుగుతే అరెస్టులు అందుకే వినే వారు. లేరు కనుక దున్నపోతు ద్వారా ప్రభుత్వానికి ఎరువులు ఇవ్వమని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరంజ్యోతి, మాజీ కౌన్సిలర్స్ నాగన్న యాదవ్, ఉంగ్లం తిరు మల్, ప్రేమ్ నాథ్ రెడ్డి కంచరవి ,స్టార్ రహీం, దేగ మహేశ్వర్ రెడ్డి, మాధవ రెడ్డి, హేమంత్ ముదిరాజ్, అవిశెట్టి భాగ్యరాజ్, జోహేబ్ హుస్సేన్, ఇమ్రాన్, చిట్యాల రాము, ఆరిఫ్, గాడిదల మోహన్, బాల్ రాజ్ , నందిమల్ల సుబ్బు,అలీమ్ అనుపటి రాము, సంతోష్, ముని కుమార్, జెర్రీ , సాదిక్, వాటర్ మహబూబ్, ఖాదర్ , లక్ష్మణ్ గౌడ్, వెంకటేష్, తోట శ్రీను, శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి రాజీనామా



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 26:** తాము కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ నంగునూర్ మండల ఉపాధ్యక్షుడు గోనేపల్లి శివ ప్రసాద్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం సాయి శ్యామ్ తెలిపారు. తమతో పాటు తమ వర్గం కూడా పార్టీ నుంచి వైదొలుగుతున్నట్లు వారు వెల్లడించారు. మంగళవారం శివ ప్రసాద్ గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీలో గత కొన్ని సవంత్సరాలగా పని చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీలోకి వచ్చానన్నాడు. ప్రతి పరిస్థితి లోను పార్టీ ప్రయోజనల కోసం పని చేశానని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఎవరెవరో పార్టీలోకి వచ్చి నిజమైన కార్యకర్తల కష్టాన్ని దోచుకొని పదవులను పొందుతున్నారని ఆరోపించారు. అలాగే వచ్చే స్థానిక ఎన్నికలలో కూడా తమకు ఎలాంటి అవకాశాలు ఇవ్వమని చెప్తున్నారన్నారు. తమ పనితనం చూస్తూ కూడా అధిష్టానం అలా మాట్లాడటం కలచి వేసిందన్నారు. రాహుల్ గాంధీ యువకులకు అవకాశలు కల్పించాలని, యువత రాజకీయం లోకి రావాలి అని పిలుపు ఇస్తే ఇక్కడేమో అంత మా ఇష్టం అనే ధోరణి తమను ఇబ్బంది పెట్టిందన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం పని చేస్తున్న తమ పట్ల అను చితంగా వ్యవహారిస్తూ కార్యకర్తలపై కేసులు పెట్టడం, ప్రజలకు రావాల్సిన సంక్షేమ పథ కాల విషయంలో నియంతగా వ్యవహారిస్తూ అర్హులైన వారికీ దక్కనివ్వడం లేదన్నారు. అలాగే భూములు కబ్జాకు గురి అవుతున్నా వారి పైన ఎలాంటి చర్యలు తీసుకోకుండా తమల్నే దుశించడం సరికాదన్నారు.

## వినాయక వేడుకలకు ఉచిత విద్యుత్



**జనం పవర్, భీమదేవరపల్లి, ఆగస్టు 26:** గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేయనున్న మండపాలకు ఉచిత విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించేందుకు టిజీఎన్‌పిడీసీ ఎల్ ఆదేశాలు జారీ చేసింది. వివిధ శాఖల అనుమతులతో ఏర్పాటు చేసే ఉత్సవాల మండపాలకు మాత్రమే ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 6వ తేది వరకు వారికి అవసరమైన విద్యుత్తు ఉచితంగా సరఫరా చేయనుంది. సెప్టెంబర్ 24నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న దుర్గా నవరాత్రి ఉత్సవాల నిర్వహణ మండళ్లకు కూడా ఉచితంగా అందించనున్నారు. దీంతో ఆయా ఉత్సవాల నిర్వాహకులు బిల్లు చెల్లింపు నుంచి కొంత ఆర్థికంగా ఊరట లభించనుంది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 15 వందల మండళ్లు ఏర్పాటు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## మట్టి గణపతి విగ్రహాల పంపిణీ




**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 26:** జిల్లా కేంద్రంలో మంగళవారం క్రెడాయ్ ఆధ్వర్యంలో డిఎస్పీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, క్రెడాయి అధ్యక్షుడు సింగోటం భాస్క ర్ రెడ్డి ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ, నాయకులు సబ్బిరెడ్డి వెంకట్ రెడ్డి, పోచా రవీందర్ రెడ్డి, సతీష్, జీజీ, శ్రీను, నాగన్న, బ్రహ్మం, కమీషనర్, యాదగిరి, తిరుపతయ్య, సాగర్ పాల్గొన్నారు.

## పండుగ వేళ పర్యావరణాన్ని కాపాడాలి

**- డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గంధం రవి కుమార్**



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 26:** వినాయక చవితి పర్వదినం సందర్భంగా వన పర్తి జిల్లా డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గంధం రవికుమార్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగల ఆనందాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం ఎంత ముఖ్యమో, అంతే ప్రాధాన్యం పర్యావరణ పరిరక్షణకు ఇవ్వాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా ఎక్కువగా రసాయనాలతో తయారైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ప్రతిష్ఠిండడం వల్ల నీటి వనరులు కాలుష్యం చెంది పర్యావరణానికి హాని కలుగు తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యలు రాకుండా ప్రతి కుటుంబం మట్టి గణేశులను ప్రతిష్టించడమే సమాజానికి మేలని పిలుపునిచ్చారు. మన సంప్రదాయం, భక్తి, ఆనందం కాపాడటంతో పాటు పర్యావరణానికి హాని కలగకుండా పండగను జరుపుకోవడం మనందరి బాధ్యత అన్నారు. చిన్నపిల్లలకు కూడా ఈ విషయాన్ని వివరించి, భవిష్యత్తు తరాలకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత తెలియజేయాలన్నారు. వినాయక చవితి పండుగ హిందూ మత విశిష్టతను ప్రతిబింబించడమే కాక సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించే గొప్ప సందేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. గణపతి బాపా మహత్యాన్ని ప్రతి ఇంటిలో ఆచరణలో నిలబెట్టాలని, భక్తి భావంతో పూజలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు.

## మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 26:** వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో మట్టి గణపతిలను పూజిద్దాం..పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, వనపర్తి పట్టణ ప్రజలు పాల్గొని ప్రతిమలను తీసుకెళ్లారు.

## ప్రతిభ స్కూల్‌లో ఎకో ఫ్రెండ్లీ గణేశా



**జనం పవర్, పటాన్‌చెరు (జిన్నారం):** జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతిభ విద్యానికేతన్ హైస్కూల్‌లో మంగళవారం ఎకో ఫ్రెండ్లీ గణేశా కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా నిర్వహించారు. పర్యావరణ హితమైన మట్టి గణేశ్ ప్రతిమలను విద్యార్థులు స్వయంగా తయారు చేశారు. చిన్నారుల చేతులతో రూపుదిద్దుకున్న ప్రతిమలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడే విధంగా విద్యార్థులు చూపిన సృజనాత్మకత ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపక బృందాన్ని అభినందించారు. అనంతరం విద్యార్థులకు ఎకో ఫ్రెండ్లీ గణేశా ప్రతిమలు పంపిణీ చేశారు.

# జన్నారం ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోలర్‌ను నియమించాలి

**సీపీఎం మండల కార్యదర్శి అశోక్**

**జనం పవర్, జన్నారం, ఆగస్టు 26:** జన్నారం బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం అధికారులు కంట్రోలరును నియమించాలని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ కోరారు. బస్టాండ్‌లో గతంలో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగిని కంట్రోలర్‌గా నియమించి, ఆ తర్వాత తీసివేశారన్నారు. ప్రయాణికులకు బస్సుల సమయాలు తెలియడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సీపీఎం నాయకులు బస్టాండ్‌కు వెళ్లి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులతో కిటకిటలాడే ఆర్టీసీ బస్టాండ్లో సమస్యలు తిష్ట వేశాయన్నారు. ఏళ్ల తరబడి బస్టాండ్ ఆవరణలో సమస్యలతో ప్రయాణికులు సతమతమవుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రహదారిపై ఉన్న ఈ బస్టాండ్‌లోకి మంచిర్యాల్, ఆదిలాబాద్, జగిత్యాల, ఉట్నూర్, నిర్మల్, హైదరాబాద్, గుంటూరు, కడెం, ఖానాపూర్ తదితర ప్రాంతాలకు నిత్యం ఆర్టీసీ బస్సులు రాకపోకలు జరుగుతున్నాయి. ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపై నిరీక్షించడం బాధాకరం. పలుసార్లు బస్టాండ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. సులబ్ కాంప్లెక్స్ లేకపోవడం వలన బహిరంగ మలవిసర్జనతో దుర్గంధం వెదజల్లుతోందని, మూత్రశాలలు పనిచేయక పోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేరుకే పెద్ద బస్టాండ్‌గా మిగిలిపోయింది. సమస్యలను పరిష్కరించి కంట్రోలరును నియమిస్తే నిరక్షరాస్యులకు బస్సు ఎటు వెళ్తుందో తెలుస్తుందన్నారు. బస్టాండ్ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, ప్రయాణికులు కూర్చోవడానికి ప్రత్యేక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు కుకటికారి బుచ్చన్న, గుడ్ల రాజన్న, అంబటి లక్ష్మణ్ తదితరులు, పాల్గొన్నారు.






## పాఠకులకు విజ్ఞప్తి

వినాయక చవితి శుభ సందర్భంగా జ్ఞానానికి, శ్రద్ధకు, శక్తికి ప్రతీక శ్రీ వినాయకుడి ఆశీస్సులతో "జనం పవర్" పత్రికను మీ ముందుకు తీసుకొస్తున్నాం.

ప్రజల సమస్యలు, వాస్తవాలు, సామాజిక, రాజకీయ విశ్లేషణలతో.. గ్రామీణ స్థాయి వార్తల నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి విశేషాల వరకూ.. నిజాయితీ, నిబద్ధత, నిష్పక్షపాత ధోరణితో.. మీ స్వరమే మా శక్తి.

**వినాయక చవితి శుభాకాంక్షలు..**

నేడు (27.08.2025)న మా కార్యాలయానికి సెలవు. కావున గురువారం (28.08.2025) రోజు సంచిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం (29.08.2025).

- మేనేజ్‌మెంట్

### 12 సంవత్సరాలుగా మూతపడిన ప్రభుత్వ పాఠశాలను
## ప్రారంభించిన ముథోల్ ఎమ్మెల్యే



**జనం పవర్, భైంసా, ఆగస్టు 26:**
గత 12 సంవత్సరాలుగా మూతబడిన భైంసా మండలంలోని బబుల్గాం గ్రామ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫామ్ అందించడంతోపాటు విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు రాష్ట్ర ఉద్యోగాల భర్తీకి మొదటి ప్రాధాన్యత ఇస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థుల కోసం ప్రభుత్వం లక్షలది రూపాయలను ఖర్చు చేస్తుందన్నారు. తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా ఎంఈఓ సుభాష్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, భైంసా రూరల్ బీజేపీ అధ్యక్షులు సుష్మ రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# స్ట్రక్చర్ కమిటీలో సమస్యలపై చర్చ



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 26:** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు మంగళవారం గుర్తింపు ప్రాతినిధ్య సంఘం సభ్యులతో స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించి కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుర్తింపు ప్రాతినిధ్య సంఘం సభ్యులు స్ట్రక్చర్ కమిటీలో డిమాండ్లపై వినతి పత్రాలను అందజేశారు. డిమాండ్ల అమలుకు సాధ్య సాధ్యలను పరిశీలించి ఏరియా పరిధిలో పరిష్కరించదగిన డిమాండ్లను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఏరియా జీఎం ఆదేశించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జీఎంతో పాటు గుర్తింపు సంఘం ఏఐ టీయూసీ కొత్తగూడెం ఏరియా అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె గట్టయ్య, సత్తుపల్లి ఏరియా ప్రతినిధి సముద్రాల సుధాకర్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, స్ట్రక్చర్ కమిటీ మెంబర్స్ జి.సీత రామరాజు, పోశం శ్రీనివాస్, యాజమాన్య ప్రతినిధులుగా ఏరియా ఇంజనీర్ కే. సూర్యనారాయణ రాజు, ఎజిఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ, డిజిఎం (పర్సనల్) జివి.మోహన్ రావు, డిజిఎం(ఐఈడి) ఎన్. యోహాన్, జెవిఆర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి.ఆర్ ప్రహ్లాద్, పద్మావతి ఖని ఏజెంట్ రామ్ భరోస్ మహతో, డిజిఎం (ఈ అండ్ ఎం) జెవిఆర్ సి.హెచ్.పి కే. సోమశేఖర్, డిజిఎం (ఈ అండ్ఎం) ఏరియా వర్క్ షాప్ టి.శ్రీకాంత్, ఏరియా స్టోర్స్ ఇంచార్జ్ లక్ష్మణమూర్తి, ఇంచార్జ్ ఆర్.సి. హెచ్.పి ఎస్.కే.కరీముల్లా, మెడికల్ సూపరింటెండెంట్ ఎం.పరశురాములు, డివైపిఎం (పర్సనల్) గోవర్ధన హరీష్, మేనేజ్మెంట్ ట్రైనీ (పర్సనల్)డి.కావ్య, ఇతర పర్సనల్ డిపార్ట్మెంట్ ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆర్జీ-1లో సమీక్ష సమావేశం

**జనం పవర్, రామగుండం, ఆగస్ట్ 26:** ఆర్.జి.1 ఏరియా పర్సనల్ డిపార్ట్ మెంట్ కు సంబంధించిన పలు విషయాల గురించి సంక్షేమాధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఆర్.జి.1 ఏరియాలోని గనులు, డిపార్ట్ మెంట్స్‌లలో పని చేస్తూ గైర్హాజర్ ఉద్యోగుల గురించి, సిఎంపిఎఫ్ నామినేషన్లు పెండింగ్, కారుణ్య నియామక ఉద్యోగాలు, టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులపై తదితర అంశాలపై అన్ని గనుల సంక్షేమాధికారులతో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి, పర్సనల్ అధికారులు, సంక్షేమాధికారులు, పిఏలతో సమీక్ష నిర్వహించారు.

ఈ సమావేశంలో ఆర్.జి 1 ఏరియాలోని కార్మికులకు సంబంధించిన పలు అంశాల గురించి చర్చించటం జరిగింది. పదవి విరమణ పొందిన ఉద్యోగుల టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపు, ప్రమోషన్స్, పెన్షన్ సంబంధిత సమస్యలు, విధులకు గైర్హాజరు అవుతున్న కార్మికులకు సంబంధించిన కౌన్సిలింగ్ వివరాలు, హాజరు శాతం పెంచుటకు చేపట్టవలసిన ప్రణాళికలు, సి.ఎం.పి.ఎఫ్ సెటిల్‌మెంట్స్, కారుణ్య నియామకాలు, క్వార్టర్ అలాట్ మెంట్, బదిలీలకు సంబంధించిన మరియు ఆర్జీ.1 లోని ఇతర పర్సనల్ డిపార్ట్ మెంట్ కు సంబంధించిన, ఉద్యోగులకు యొక్క సంక్షేమ సదుపాయాలు, బెనిఫిట్స్ గురించి ఈ సమావేశంలో చర్చించారు.

ఈ సమావేశంలో డివైపియం వేణు, సీనియర్ పి.ఓలు ప్రవీణ్ కుమార్, హనుమంత రావు, ఫిరోజ్ ఖాన్, సంక్షేమ అధికారులు రవీందర్, గణేశ్, నాగరాజు, శ్రీనివాస్, సాయి నిహల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జనం పవర్, చెన్నూరు, ఆగస్టు 26:** ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు అందించే ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మురళీ కృష్ణ తో కలిసి పట్టణంలో అమృత్ 2.0లో భాగంగా చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ల ద్వారా ఇంటింటికి శుద్ధమైన త్రాగునీటిని అందించడం జరుగుతుందని, అమృత్ 2.0 ద్వారా అన్ని నివాసాలకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్‌తో కలిసి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, తరగతి గదులు, వంటశాల, పరిసరాలు పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వంటలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో పాడైన ఆర్.ఓ. ప్లాంట్ స్థానంలో క్రొత్తది ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇంటర్మీడియట్ ఎంపిసి, 10వ తరగతి విద్యార్థులకు స్వయంగా పాఠ్యాంశాలు బోధించారు. విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్**



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 26:** వివిధ సమస్యలతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ వైద్యులను ఆదేశించారు. మంగళవారం పాల్వంచ మండలం శేఖరం బంజర గ్రామంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా కలెక్టర్ ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను పర్యవేక్షించి రోగుల రికార్డులు, ఔషధ నిల్వలు వ్యాక్సిన్ భద్రత ల్యాబ్ సదుపాయాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులు నర్సింగ్ సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి సమయానికి మంచి వైద్యం అందించాలని ఆదేశించారు. వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించి విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా క్రమశిక్షణతో వ్యవహరించాలని ఆయన ప్రత్యేకంగా సూచించారు. గర్భిణీలు చిన్న పిల్లలు వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సేవలలో ఎలాంటి లోపం జరగరాదని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా భవనంలోని పైకప్పు స్లాబ్ లీకేజీ సమస్యను గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలను కల్పించాలన్నారు. జిల్లాలో ఆరోగ్య సేవల మెరుగుదలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలోనూ ప్రాథమిక వైద్య సదుపాయాలు మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ కుమారి, పి హెచ్‌ఓ. శ్రీనివాస్, ఎల్‌టి శృతి, స్టాఫ్ నర్స్ రాములమ్మ, ఫార్మాసిస్ట్ లలిత, మెడికల్ అసిస్టెంట్ సుధాకర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్**

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 26:** పేదల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ విమర్శించారు. మంగళవారం పాల్వంచ పట్టణంలో పోతినేని సుదర్శన్ సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లతో పాటు జిల్లా పట్టణ నాయకత్వంతో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం బృందం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిశీలించింది. అనంతరం ప్రదర్శనగా డబల్ బెడ్ రూమ్ ఇండ్ల వరకు వెళ్లి స్థితిగతులను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల పోరాటం వల్ల గత ప్రభుత్వం డబల్ బెడ్ ఇండ్లను కట్టి ఇస్తానని పూర్తి చేయకుండా మధ్యలోనే నిలిపివేసిందన్నారు. ఐదేండ్ల గడిచిపోయిన ఒక్క ఇల్లు కూడా పేదలకు ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలం గడుస్తున్నప్పటికీ నేటికీ డబల్ బెడ్రూంలో పునర్నిర్మాణం చేపట్టడానికి అవకాశాలు ఉన్నప్పటికీ పేదల కోసం కట్టించాల్సిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను శిథిలావస్థకు చేరడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన అందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు లేని పేదలను పరిశీలించి అర్హులైన వారందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని సుదర్శన్ డిమాండ్ చేశారు. మైక్రో ఫైనాన్స్ వల్ల మహిళల ఇబ్బందులు గురవుతున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. మైక్రో ఫైనాన్స్‌లతో ఇబ్బందులు పడుతున్నవారు సీపీఎం నాయకత్వం దృష్టికి తీసుకు వస్తే కఠిన చర్యలు తీసుకునేలా ప్రయత్నం చేస్తామని మహిళలకు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నవరపు, సత్యనారాయణ, మందలపు జ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ రవికుమార్, పట్టణ కార్యదర్శి పొదిల తులసీరామ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే.సత్య, పట్టణ కమిటీ సభ్యులు కాంతి, మాధవి, పార్టీ సభ్యులు సునీత, పద్మ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి యోగ పోటీలకు ఎంపికైన
## ఈలేగాం యువకుడు అర్గుల సాయినాథ్



**జనం పవర్, భైంసా, ఆగస్టు 26:** మహారాష్ట్ర యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీడ్ జిల్లాలో ఈ నెల 24, 25 తేదీలలో నిర్వహించిన యోగాసన పోటీలలో నిర్మల్ జిల్లా, భైంసా మండలం, ఈలేగాం గ్రామానికి చెందిన అర్గుల సాయినాథ్, 35 పురుషుల విభాగంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి, బంగారు పతకం కైవసం చేసుకున్నాడు.

నిరుపేద దంపతులు అర్గుల రుక్మా బాయి-భర్తన్న రెండవ కుమారుడైన అర్గుల సాయినాథ్, కుటుంబాన్ని పోషించడానికి తల్లిదండ్రులతో కలిసి కూలి పని, పశువుల పోషించడం పని చేశాడు. పట్టుదల ఉంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనా విజయం సాధించవచ్చని అర్గుల సాయినాథ్ నిరూపించాడు. అతను చిన్న వయసులోనే తండ్రి పనులలో సహాయపడి సాయంత్రం సమయంలో యోగా గురువు అబ్దుల్ మతీమ్ సహాయంతో యోగాను నేర్చుకున్నాడు. ప్రస్తుతం కొల్హాపూర్ శివాజీ యూనివర్సిటీలో ఎంఏ యోగ శాస్త్రంలో ప్రథమ సంవత్సరం చదువుకుంటున్న సాయినాథ్ యోగా పోటీలలో ప్రథమ స్థానం సాధించడంతో నిర్మల్ జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు అభినందించారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్ నుంచి ప్రాతినిధ్యం వహించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం పొందాడు. అర్గుల సాయినాథ్ అక్టోబర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలు జార్ఖండ్, రాంచీ ప్రదేశాల్లో మహారాష్ట్ర నుంచి ప్రతినిత్యం వహించనున్నాడు. సాయినాథ్‌ను యోగ శాస్త్రం అధిపతి డాక్టర్ రామచంద్ర పవర్, ప్రొఫెసర్ రవీందర్, మరికొ తదితరులు అభినందించారు.

# విద్యారంగంలో అలసత్వం ఉండకూడదు

**- మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభు దయాళ్**



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 26:** పాఠశాల విద్యా రంగంలో పలు సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభు దయాల్ తెలిపారు. మంగళవారం కొత్తగూడెం మండల స్థాయి సకల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభు దయాల్ రివ్యూ నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు రాత పుస్తకాలు వర్క్ పుస్తకాలు లైబ్రరీ పుస్తకాలు సైన్స్ ల్యాబ్ పరికరాలు ఏకరూప దుస్తుల గుర్తి చర్చించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు రోజువారీ హాజరు ఎఫ్ ఆర్ ఎస్ నమోదు లైబ్రరీ పుస్తకాల వినియోగం మధ్యాహ్న భోజన పథక అమలు మెనూ నిర్వహణ ఈ నెలలో నిర్వహించిన విద్యా కార్యక్రమాల గుర్చి పూర్తి సమీక్ష నిర్వహించారు. విద్యా రంగంలో అలసత్వం కూడదని విద్యార్థుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సకల హెచ్‌ఎంలు, ఎంఆర్సి సిబ్బంది, సిఆర్పిలు, డిఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# కదిలి పాపేశ్వర ఆలయం హుండీ లెక్కింపు

**జనం పవర్, భైంసా, ఆగస్టు 26:** దిలావర్‌పూర్ మండలంలోని అతి పురాతనమైన కదిలి పాపేశ్వర్ ఆలయ హుండీ నీ మంగళవారం దేవదాయ శాఖ అధికారులు పోలీస్ సమక్షంలో లెక్కించారు. మొత్తం హుండీ రూ. 6,60,930 లక్షల రూపాయలు ఆదాయం చేకూరిందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి భూమయ్య తెలిపారు. కదిలి పాపేశ్వరం ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శ్రావణమాసంలో అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, పోలీసులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విరాట్ కోహ్లీ లైక్..

## ఎట్టకేలకు స్పందించిన అవ్‌నీత్‌కౌర్

ఇటీవల ఒక్కసారిగా ఫేమస్ అయ్యారు నటి అవ్‌నీత్‌కౌర్. అనుకోకుండా ఆమె పోస్ట్‌కు విరాట్ కోహ్లీ లైక్ కొట్టడంతో గంటల వ్యవధిలోనే ఆమెకు 2 మిలియన్ల మంది ఫాలోవర్స్ పెరిగారు. సోషల్ మీడియాలో ఆమెతో పాటు, కోహ్లీ లైక్ కూడా ఎన్నో చర్చలకు దారి తీసింది. దీనిపై ఇప్పటికే విరాట్ వివరణ ఇవ్వగా.. ఎట్టకేలకు అవ్‌నీత్ తాజాగా స్పందించారు. ఆమె తాజా చిత్రం 'లవ్ ఇన్ వియత్నాం' సినిమా ప్రచారంలో పాల్గొన్న అవ్‌నీత్.. నెటిజన్లే కాకుండా అగ్ర నటీనటులు కూడా తనపై ప్రేమాభిమానాలు చూపుతున్నారని అన్నారు. కోహ్లీ లైక్‌పై పరోక్షంగా ప్రస్తావిస్తూ నవ్వుతూ సమాధానమిచ్చారు. 'ప్రేమ దొరుకుతూనే ఉండాలి.. నేను ఈ మాటకు మించి చెప్పలేను' అని అన్నారు. అవ్‌నీత్ ఫొటోను విరాట్ లైక్ చేసిన తర్వాత ఆమె జీవితం పూర్తిగా మారిపోయిన విషయం తెలిసిందే. తన ఇన్‌స్టాలో ఫాలోవర్స్ మిలియన్లలో పెరిగారు. అలాగే 12 బ్రాండ్లను ప్రమోట్ చేయడం కోసం ఆమె సైన్ చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఇక తన లైక్‌పై కోహ్లీ గతంలోనే క్లారిటీ ఇచ్చారు. ఇన్‌స్టాలోని ఫీడ్‌ను క్లియర్ చేస్తుండగా పొరపాటున లైక్ బటన్ ప్రెస్ అయిందని అన్నారు. దీనివెనక ఎలాంటి ఉద్దేశం లేదని స్పష్టతనిచ్చారు. దయచేసి అనవసర ఊహాగానాలు సృష్టించొద్దన్నారు. మరోవైపు ఈ మొత్తం వ్యవహారంపై పలువురు సెలబ్రిటీలు వారి అభిప్రాయాలను పంచుకున్నారు. పొరపాటున జరిగిందా.. లేదా అనేది తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు రాసేశారన్నారు. సోషల్ మీడియాలో ప్రజలు అనవసరంగా సమయం వృథా చేస్తున్నారని అభిప్రాయపడ్డారు.








## భాగస్వామి కావాలా మీకు?

'డు యూ వాన్నా పార్ట్‌నర్?' అని అడుగుతోంది అందాల తార తమన్నా. మరి ఈమేంటి పార్ట్‌నర్ గురించి మాట్లాడుతుందని అనుకుంటున్నారా? అయితే దీని గురించి పూర్తిగా తెలుసుకోవాల్సిందే. వైవిధ్యమైన పాత్రలతో, ప్రత్యేక పాటలతో కుర్రకారుని అలరిస్తోన్న ఈ భామ.. ఓటీటీ వేదికగా కూడా సత్తా చాటుతోంది. ఇప్పుడామె మరో కొత్త వెబ్‌సిరీస్‌తో రాబోతుంది. తమన్నా ప్రధాన పాత్రలో నటించిన సిరీస్ 'డు యూ వాన్నా పార్ట్‌నర్'. డయానా పెంటీ కీలక పాత్ర పోషించింది. తాజాగా ఈ సిరీస్‌ను ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో. గంగోపాధ్యాయ, నిశాంత్ నాయక్ రూపొందించారు. ఇద్దరు యువతుల స్నేహం, వారు ఎదుర్కొన్న సవాళ్లు తదితర అంశాలతో దీన్ని రూపొందించారు. ఈ కామెడీ డ్రామా వెబ్‌సిరీస్ సెప్టెంబరు 12న రానుంది.

స్పోర్ట్స్




## గణేశ్ బృందానికి పసిడి

ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్‌లో తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన తిరుమూరు గణేష్ మణిరత్నం పసిడి పతకం గెలిచాడు. కెనడాలో జరిగిన టోర్నీలో గణేశ్, కుశాల్, నితిన్‌లతో కూడిన భారత బృందం అండర్-21 కాంపౌండ్ పురుషుల టీమ్ విభాగంలో అగ్రస్థానంలో నిలిచింది. అండర్-19 మహిళల విభాగంలో శార్వరి షిండే కూడా పసిడి సాధించింది. ఈ టోర్నీలో భారత్ నాలుగు స్వర్ణాలు, రెండు రజతాలు, రెండు కాంస్య పతకాలు సాధించింది.

## రోహిత్ శర్మను తప్పించడానికే బ్రాంకో టెస్ట్: టీమ్ ఇండియా మాజీ క్రికెటర్



టీమ్‌ఇండియా ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను తేల్చేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న యోయో పరీక్షతో పాటు బ్రాంకో టెస్టునూ ఇకపై బీసీసీఐ ప్రవేశ పెట్టనుంది. ఈ నిర్ణయంపై పలువురు మాజీల నుంచి మిశ్రమ స్పందనలు వచ్చాయి. అయితే టీమ్‌ఇండియా ఆటగాళ్లలో ఫిట్‌నెస్ ప్రమాణాలను పెంచడం కోసం స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్ అడ్రియన్ లి రాక్స్ ఈ పరీక్షను జట్టుకు పరిచయం చేశాడు. అంటే ఇకపై ఓ ఆటగాడు పూర్తి ఫిట్‌గా ఉన్నాడని ధ్రువీకరించాలంటే అతడు యోయోతో పాటు బ్రాంకో టెస్టులోనూ పాసవ్వాల్సి ఉంటుంది. అయితే.. రోహిత్ శర్మను వన్డే జట్టు నుంచి తప్పించడానికే ఈ టెస్ట్‌ను ప్రవేశపెట్టారని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ తీవ్రమైన ఆరోపణలు చేశాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ.. ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు తమ వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వీరిద్దరూ వన్డే ఫార్మాట్లోనే కొనసాగుతున్నారు. వీరు 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడదామనుకుంటున్నారు. అయితే రోహిత్ శర్మకు బ్రాంకో టెస్ట్ పాస్ కావడం కాస్త కష్టంతో కూడుకున్న పని అని మనోజ్ తివారీ ఓ ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డాడు. 'నా ఉద్దేశం ప్రకారం 2027 వరల్డ్ కప్ ప్రణాళిక నుంచి విరాట్ కోహ్లీని పక్కకు పెట్టడం అంత సులువు కాదు. కానీ వారు రోహిత్ శర్మను తప్పించాలనుకుంటున్నారు. ఇండియన్ క్రికెట్‌లో ఏం జరుగుతుందో నేను సునిశితంగా పరిశీలిస్తున్నా. రోహిత్ శర్మను భవిష్యత్తులో వన్డే జట్టు నుంచి దూరం చేయడం కోసమే ఇటీవల బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెట్టారు' అని మనోజ్ తివారీ ఆరోపించాడు. 'మీకు తెలుసా.. బ్రాంకో టెస్ట్ అత్యంత కఠినమైన ఫిట్‌నెస్ పరీక్షల్లో ఒకటి. అయితే ఈ టెస్ట్‌ను ఇప్పుడే ఎందుకు ప్రవేశపెట్టారనేదే ప్రశ్న. కొత్త హెడ్‌కోచ్ ఈ పరీక్షను మొదటి సిరీస్ నుంచే ఎందుకు అమలు చేయలేదు? అసలు ఇది ఎవరి ఆలోచన? దీన్ని ఎవరు ప్రవేశపెట్టారు? కొన్ని రోజుల క్రితం ఈ బ్రాంకో టెస్ట్‌ను ఎవరు అమలు చేశారు? ఇవి నా దగ్గర సమాధానాలు లేని ప్రశ్నలు. కానీ రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్‌పై మరింత దృష్టి పెట్టకపోతే.. ఈ టెస్ట్ పాసవడం అతడికి అంత తేలిక కాదు. ఈ బ్రాంకో టెస్ట్‌తో.. రోహిత్ శర్మను వన్డే జట్టు నుంచి తప్పిస్తారని నేను భావిస్తున్నా' అని మనోజ్ తివారీ వాపోయాడు. బ్రాంకో అంటే పరుగు పరీక్ష. ఎక్కువగా రగ్బీ ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను నిర్ణయించేందుకు ఉపయోగిస్తారు. దీని ద్వారా ప్లేయర్ల శారీరక సామర్థ్యం, వేగం, మానసిక దృఢత్వంపై ఓ అంచనాకు రావొచ్చు. ఈ పరీక్షలో ఒక ఆటగాడు విరామం లేకుండా ఆరు నిమిషాల వ్యవధిలో మొత్తంగా 1200 మీటర్ల దూరం పరుగెత్తాల్సి ఉంటుంది.

PRINTED PUBLISHED,OWNED BY G.THIRUPATHI,PRINTED AT SRK PRINTERS (V)KOKKERAKUNTA (M)RAMADUGU (D)KARIMNAGAR 505001.TELANGANA,
PUBLISHED FROM H.NO 10-6-219, KISAN NAGAR,KARIMNAGAR 505001,TELANGANA.RNI NO TEL **TEL/2016/69862**, EDITOR:BANDARI MARUTHI.